తెలంగాణ TELANGANA MUCHATLU



ముచ్చట్లు

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం - 27 - నవంబర్ 2026 | సంపుటి : 4 | సంచిక : 173 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in

ప్యాకెట్లపై ఎర్రటి హెచ్చరికలు తప్పనిసరి!

- *అధిక చక్కెర, కొవ్వు, ఉప్పు ఉన్న ఆహారాలపై ప్రత్యేక గుర్తులు*
- *వినియోగదారుల ఆరోగ్య రక్షణకు సుప్రీంకోర్టు ఆదేశాలు*
- *ప్రతి పోషకానికి ప్రత్యేకంగా ఎర్రటి షడ్భుజి గుర్తు*
- *పాఠశాల స్థాయి నుంచే పోషకాహారంపై అవగాహనకు సూచనలు*

న్యూఢిల్లీ, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):

ప్యాకేజ్డ్ ఆహార పదార్థాల వినియోగంలో ప్రజారోగ్యానికి ప్రాధాన్యం కల్పించే దిశగా సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. అధిక మోతాదులో కొవ్వు, చక్కెర, ఉప్పు కలిగిన ఆహార పదార్థాల ప్యాకెట్లపై వినియోగదారులకు వెంటనే కనిపించేలా స్పష్టమైన హెచ్చరికలు ముద్రించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ)ను ఆదేశించింది. ఆహార పదార్థాలను కొనుగోలు చేసే సమయంలో వాటిలో ఉండే అనారోగ్యకర పోషకాల గురించి ప్రజలకు ముందుగానే సమాచారం అందించడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశం. జస్టిస్ జె.బి. పార్థివాలా, జస్టిస్ కె. వినోద్ చంద్రన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు మార్గదర్శకాలను సూచించింది.

మిగతా 8 లో..





లక్ష ఉద్యోగాల లక్ష్యం పూర్తి చేస్తాం

- *ఏడాదిలో మరో 25 వేల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ*
- *ఇప్పటికే 75 వేల నియామకాలు..*
- *అచ్చంపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటన*
- *కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం*
- *కొత్తగా 4.89 లక్షల మందికి పింఛన్ల పంపిణీకి శ్రీకారం*

అచ్చంపేట, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):

రాష్ట్రంలోని నిరుద్యోగ యువతీ యువకులకు మరో శుభవార్త అందించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. వచ్చే ఏడాది కాలంలో మరో 25 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని ప్రకటించారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీలను గుర్తించి నియామకాలపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలైన నీళ్లు, నిధులు, నియామకాల సాధనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పటికే 75 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మరో 25 వేల నియామకాలతో లక్ష ఉద్యోగాల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలో నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి బాట కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చౌరస్తా నుంచి మంత్రులు, ప్రజాప్రతినిధులు, స్థానికులతో కలిసి పాదయాత్ర నిర్వహించారు. అనంతరం బహిరంగ సభలో

మిగతా 2 లో..



మహిళలు పంచాయతీ నుంచి పార్లమెంట్‌కు ఎదగాలి

- *మహిళలకు ఆర్థికంగా, హార్దికంగా అండగా ఉంటానని హామీ*
- *పనితోపాటు పదవుల్లోనూ సమాన ప్రాధాన్యత కల్పించాలని పిలుపు*
- *ప్రతి ఇంట్లో మతగ్రంథంతోపాటు రాజ్యాంగం ఉండాలని సూచించన కవిత*
- *తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగానికి 'తెలంగాణ రుద్రమసేన'గా నామకరణం*

హైదరాబాద్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):

మహిళలు పంచాయతీ స్థాయి నుంచి పార్లమెంట్ వరకు రాజకీయంగా ఎదిగేందుకు తాను ఆర్థికంగా, హార్దికంగా అండగా ఉంటానని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత హామీ ఇచ్చారు. జనాభాలో సగం ఉన్న మహిళలకు అవకాశాల్లోనూ సగం వాటా దక్కాలని కోరారు. మహిళలకు పనిలోనే కాకుండా పదవుల్లోనూ ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మహిళల హక్కులు, రాజకీయ ప్రాతినిధ్యం, రాజ్యాంగం కల్పించిన అవకాశాలపై గురువారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో నిర్వహించిన 'మహిళలు రాజ్యాంగం' సదస్సులో ఆమె మాట్లాడారు.

రాజ్యాంగాన్ని ఆమోదించుకున్న రోజే మహిళలకు నిజమైన పండుగ రోజని కవిత అభివర్ణించారు. వేల ఏళ్లుగా మహిళలను వస్తువులుగా, ఆస్తులుగా మాత్రమే చూసిన సమాజంలో వారిని సంపూర్ణ మనుషులుగా గుర్తించింది రాజ్యాంగమేనని అన్నారు. మహిళలకు ఓటు హక్కుతోపాటు సమానత్వం, స్వేచ్ఛ, గౌరవంతో జీవించే హక్కులను రాజ్యాంగం కల్పించిందని వివరించారు. దేశంలో వేలాది మంది మహిళలు ఎంపీలు, ఎమ్మెల్యేలు, జిల్లా పరిషత్ చైర్మన్లుగా ఎదగడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులే పునాదిగా నిలిచాయని చెప్పారు. అందుకే ప్రతి ఇంట్లో మతగ్రంథంతోపాటు రాజ్యాంగం కూడా ఉండాలని, ప్రతి మహిళ దాన్ని తప్పనిసరిగా చదివి తన హక్కులను తెలుసుకోవాలని సూచించారు.

మహిళలపై వివక్ష ఇప్పటికీ అనేక రూపాల్లో కొనసాగుతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లికి ముందు తండ్రి, అన్న నిర్ణయాలపై, పెళ్లి తర్వాత భర్త, అత్తింటి కుటుంబ నిర్ణయాలపై మహిళల జీవితం ఆధారపడే



పరకు సమాన పనికి సమాన వేతనం అందడం లేదని పేర్కొన్నారు. కులం, మతం, ఆర్థిక స్థితిగతులతో సంబంధం లేకుండా వివిధ రూపాల్లో మహిళలు వివక్షను ఎదుర్కొంటున్నారని చెప్పారు.

మహిళలపై జరుగుతున్న దాడులు, వేధింపుల పట్ల సమాజం మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఆమె కోరారు. తన ప్రేమను అంగీకరించలేదనే కారణంతో ఓ విద్యార్థిని చెప్పుతో కొట్టిన ఘటనను ప్రస్తావిస్తూ, ఒక అమ్మాయి 'నో' చెప్పినంత మాత్రాన ఆమెపై దాడి చేసే

మిగతా 2 లో..



ప్రపంచస్థాయి సరఫరా వ్యవస్థల నిర్మాణానికి ప్రాధాన్యం

- *హైదరాబాద్‌లో సీఐఐ తెలంగాణ రక్షణ, అంతరిక్ష సదస్సు*
- *'తెలంగాణ నుంచి ప్రపంచ మార్కెట్ల వైపు' ఇతివృత్తంతో సమావేశం*
- *ప్రారంభోపన్యాసం చేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి*
- *పరిశ్రమల ప్రతినిధులు, నిపుణుల భాగస్వామ్యంతో చర్చలు*

హైదరాబాద్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో రక్షణ, అంతరిక్ష రంగాలకు సంబంధించిన పరిశ్రమల అభివృద్ధి, ప్రపంచస్థాయి సరఫరా వ్యవస్థల నిర్మాణంపై దృష్టి సారిస్తూ హైదరాబాద్‌లో గురువారం సీఐఐ తెలంగాణ డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్ కాన్క్లేవ్-2026 నిర్వహించారు. ఈ సదస్సుకు రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభోపన్యాసం చేశారు. రక్షణ, అంతరిక్ష రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలు, పరిశ్రమల విస్తరణకు అవసరమైన అంశాలపై ఈ సమావేశం వేదికగా చర్చలు జరిగాయి.

"తెలంగాణ నుంచి ప్రపంచ మార్కెట్ల వైపు - హైదరాబాద్‌లో రక్షణ మరియు అంతరిక్ష రంగాల సరఫరా వ్యవస్థల నిర్మాణం" అనే ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహించారు. రాష్ట్రంలో తయారీ రంగాన్ని బలోపేతం చేయడం, రక్షణ, అంతరిక్ష పరిశ్రమలకు అవసరమైన ఉత్పత్తులు, సేవలను అందించే సరఫరా వ్యవస్థలను అభివృద్ధి చేయడం ఈ సమావేశ ప్రధాన ఉద్దేశంగా నిలిచింది. స్థానిక పరిశ్రమలకు ప్రపంచ మార్కెట్లతో అనుసంధానం కల్పించే అవకాశాలపైనా సదస్సులో దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ సెక్యూరిటీ అడ్వైజరీ బోర్డు సభ్యుడు డాక్టర్ జి. సతీష్ రెడ్డి పాల్గొన్నారు. రక్షణ, అంతరిక్ష రంగాలకు సంబంధించిన విధానాలు, సాంకేతిక పరిజ్ఞానం, పరిశ్రమల భాగస్వామ్యం వంటి అంశాలపై ఆయన అనుభవం ఈ సదస్సుకు ప్రాధాన్యం తీసుకొచ్చింది. ఈ రంగాల్లో దేశీయ సామర్థ్యాలను పెంపొందించుకోవడం, ప్రపంచస్థాయి అవసరాలకు అనుగుణంగా తయారీ వ్యవస్థలను తీర్చిదిద్దుకోవడం వంటి అంశాలు సమావేశ ఇతివృత్తంలో కీలకంగా నిలిచాయి. సీఐఐ తెలంగాణ చైర్మన్ ఎం. గౌతమ్ రెడ్డి కూడా ఈ సదస్సులో పాల్గొన్నారు. పరిశ్రమల రంగానికి చెందిన ప్రతినిధులు, రక్షణ, అంతరిక్ష రంగాల నిపుణులు ఒకే వేదికపైకి రావడం ద్వారా పరస్పర ఆలోచనలు, అనుభవాల మార్పిడికి అవకాశం ఏర్పడింది. తెలంగాణలో ఇప్పటికే ఉన్న పారిశ్రామిక సామర్థ్యాలను ఈ రంగాల అవసరాలకు అనుగుణంగా వినియోగించుకునే మార్గాలపై చర్చించేందుకు ఈ సమావేశం దోహదపడింది. రక్షణ, అంతరిక్ష రంగాలు సాంకేతిక పరిజ్ఞానం, నాణ్యతా ప్రమాణాలు, పరిశోధన, తయారీ సామర్థ్యాలతో ముడిపడి ఉన్న కీలక రంగాలు కావడంతో వాటి సరఫరా వ్యవస్థల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. హైదరాబాద్‌ను కేంద్రంగా చేసుకుని తెలంగాణ పరిశ్రమలు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో అవకాశాలను అందిపుచ్చుకునే అంశంపై ఈ సదస్సు దృష్టి సారించింది.

పెట్టుబడుల సదస్సుతో యువతకు ఉపాధి అవకాశాలు

- *డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్*
- *ప్రజాభవన్ వార్‌రూమ్‌లో ఏర్పాట్లపై భట్టి విక్రమార్క సమీక్ష*
- *పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు మెరుగైన సదుపాయాలు*
- *అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సూచన*



హైదరాబాద్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో భారీ పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ఏర్పాట్లపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు.

మిగతా 2 లో..

పార్టీ మార్పు ప్రచారంలో వాస్తవం లేదు: వివేక్ వెంకటస్వామి

- *కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యం*
- *కొత్త ఇన్‌చార్జి సందీప్ కుమార్‌తో రాష్ట్ర రాజకీయాలపై చర్చ*
- *గిగ్ కార్మికుల సంక్షేమానికి దేశంలోనే ఆదర్శంగా చట్టం*



2 లో..

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

లక్ష ఉద్యోగాల లక్ష్యం పూర్తి చేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రవ్యాప్తంగా కోటి మంది మహిళలకు కోటి ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, నేత, గీత కార్మికులకు కొత్తగా 4.89 లక్షల పింఛన్ల పంపిణీకి కూడా శ్రీకారం చుట్టారు. అచ్చంపేట నియోజకవర్గ పరిధిలో సుమారు రూ.450 కోట్లతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు.

తెలంగాణ ఉద్యమానికి నీళ్లు, నిధులు, నియామకాలే ప్రధాన లక్ష్యాలని గుర్తుచేసిన ముఖ్యమంత్రి.. పాలమూరు ప్రాంతంలో పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేసి కృష్ణా జలాలను ఈ ప్రాంత పొలాలకు అందిస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి రాష్ట్రంలోనే కాకుండా తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా అచ్చంపేట ఎత్తిపోతల, డిండి, ఎస్ఎల్‌బీసీ, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, జూరాల, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులు పూర్తికాకపోవడం బాధాకరమన్నారు. ఆనాడు రూ.10 వేల కోట్లు ఖర్చు చేసి ఉంటే ఈ ప్రాజెక్టులు పూర్తయ్యేవని అభిప్రాయపడ్డారు. ఇవి పూర్తయి ఉంటే కృష్ణా జలాల విషయంలో ఇబ్బందులు ఉండేవి కావని, రోజుకు మూడు టీఎంసీల నీటిని వినియోగించుకునే అవకాశం ఉండేదని చెప్పారు. తద్వారా లక్షలాది ఎకరాలు సాగులోకి వచ్చేవని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డగా ఈ ప్రాంత పొలాలను కృష్ణా నీటితో తడపాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు.

అచ్చంపేట, నల్లమల ప్రాంతంతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి ప్రస్తావించారు. తాను ఈ గడ్డపై పుట్టిన బిడ్డనని, ఈ ప్రాంతానికి చేయాల్సిన అభివృద్ధి పనులు చేపట్టి, సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజల రుణం తీర్చుకుంటానని చెప్పారు. రాణి అచ్చమాంబ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ స్ఫూర్తితో పాలన సాగిస్తున్నామని తెలిపారు. జవహర్‌లాల్ నెహ్రూ విద్య, నీటి పారుదల రంగాలకు ప్రాధాన్యమిచ్చి దేశాభివృద్ధికి కృషి చేసిన తీరును వివరించారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, విధ్వంసం, అప్పులతో సతమతమైన తెలంగాణను అభివృద్ధి దిశగా నడిపించేందుకు నిరంతరం శ్రమిస్తున్నామని అన్నారు. గత 34 నెలలుగా ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేస్తున్నామని పేర్కొన్నారు. ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కోసం దశాబ్దాలుగా సాగిన పోరాటాన్ని గుర్తించి తమ ప్రభుత్వం ఆ ప్రక్రియను పూర్తి చేసిందని ముఖ్యమంత్రి తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్లలో కులగణన జరగకపోవడంతో వివిధ కులాల జనాభా, వారి జీవన ప్రమాణాలపై సరైన గణాంకాలు అందుబాటులో లేవని చెప్పారు. రాష్ట్రంలో తొలిసారిగా కులగణన చేపట్టి, కులాలవారీగా జనాభా, సామాజిక పరిస్థితులను అంచనా వేసి దేశానికి ఆదర్శంగా నిలిచామని అన్నారు. రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ కుటుంబ బీమా, ఉచిత విద్యుత్, రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతు రుణమాఫీ వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నామని వివరించారు. నిరుపేదలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, మహిళా సంఘాలకు రూ.79 వేల కోట్ల రుణ అనుసంధానం, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం వంటి పథకాలను ప్రస్తావించారు. కొత్తగా మంజూరు చేసిన 4.89 లక్షల పింఛన్లతో కలిపి రాష్ట్రంలో మొత్తం 6,00,858 పింఛన్లు అందిస్తున్నామని వెల్లడించారు. సంక్షేమ పథకాల అమలులో పార్టీ, కులం, మతం అనే తేడాలు లేకుండా అర్హులందరికీ సమానంగా ప్రయోజనాలు అందిస్తున్నామని, పేదలను ఆదుకోవడమే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

పెట్టుబడుల సదస్సుతో యువతకు ఉపాధి అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సుకు సంబంధించిన ఏర్పాట్లను గురువారం ప్రజాభవన్‌లోని వార్‌రూమ్‌లో అధికారులతో కలిసి పరిశీలించారు. సదస్సుకు దేశ, విదేశాల నుంచి హాజరయ్యే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, తెలంగాణ రాష్ట్ర ప్రత్యేకతలను వారికి పరిచయం చేయడం వంటి అంశాలపై చర్చించారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారులు, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సదస్సుకు వచ్చే పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు తెలంగాణలో సాదర స్వాగతం పలికేందుకు చేపట్టాల్సిన చర్యలపై భట్టి విక్రమార్క వివరాలు తెలుసుకున్నారు. అతిథులకు మెరుగైన వసతి, రవాణా, ఇతర అవసరమైన సదుపాయాలు కల్పించడంతోపాటు సదస్సు నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు.

పెట్టుబడుల సాధనను కేవలం రాష్ట్ర ఆర్థిక వృద్ధికి సంబంధించిన అంశంగా మాత్రమే చూడకూడదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రానికి వచ్చే ప్రతి పెట్టుబడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేలా ఉండాలని ప్రభుత్వ లక్ష్యాన్ని వివరించారు. పరిశ్రమల స్థాపన ద్వారా స్థానికంగా ఉపాధి పెరగడంతోపాటు ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ఆకాంక్షించారు. పెట్టుబడుల ద్వారా సృష్టించే సంపద, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు చేరినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధికి అనుకూలమైన పరిస్థితులను సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు వివరించేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సమర్థంగా పరిచయం చేయడంతోపాటు పారిశ్రామికవేత్తలకు అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచాలని అధికారులకు తెలిపారు. సదస్సులో పాల్గొనే ప్రతినిధులకు రాష్ట్ర పారిశ్రామిక విధానాలు, అభివృద్ధి ప్రణాళికలపై స్పష్టమైన అవగాహన కల్పించేలా సంబంధిత శాఖలు సిద్ధం కావాలని సూచించారు. సదస్సు విజయవంతం కావడానికి అన్ని ప్రభుత్వ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రతి శాఖకు అప్పగించిన బాధ్యతలను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని, ఏర్పాట్లలో ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పెట్టుబడుల ఆకర్షణతోపాటు ఉపాధి కల్పన, ప్రజల జీవన ప్రమాణాల పెంపు, అన్ని వర్గాల అభ్యున్నతికి ఈ సదస్సు దోహదపడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమగ్ర అభివృద్ధి దిశగా తెలంగాణను ముందుకు తీసుకెళ్లేందుకు ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను కీలక వేదికగా మలచాలని ప్రభుత్వం భావిస్తోంది.

మహిళలు పంచాయతీ నుంచి పార్లమెంట్‌కు ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

హక్కు ఎవరికీ లేదని అన్నారు. మరో ఘటనలో డిగ్రీ విద్యార్థిని వసతి గృహంలోని మరుగుదొడ్డిలో ప్రసవించిందన్న వార్తను ప్రస్తావిస్తూ, విద్యార్థినుల భద్రతపై ప్రశ్నలు లేవెత్తారు. మహిళల హక్కుల కోసం గతంలో పోరాడిన సావిత్రిబాయి పూలే, ఫాతిమా షేక్‌లను గుర్తుచేస్తూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్న మహిళల చరిత్రకు తగిన గుర్తింపు రాలేదన్నారు. మహిళల చరిత్రను పురుషులు రాస్తారని ఎదురుచూడకుండా మహిళలే తమ పోరాటాలను, విజయాలను నమోదు చేసుకోవాలని పిలుపునిచ్చారు. బీసీ, మైనార్టీ మహిళలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలని అభిప్రాయపడ్డారు. తాను మహిళల కోసం రాజకీయ పార్టీని కాలక్షేపం కోసం స్థాపించలేదని, వారికి అన్ని రంగాల్లో అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు వచ్చానని కవిత తెలిపారు. మహిళలకు ఇల్లు, భూమి, బ్యాంకు ఖాతా, ఉద్యోగాలు వంటి ఆర్థిక స్వావలంబనకు అవసరమైన అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. మహిళలు రాజకీయాల్లోకి వస్తే ఎదురయ్యే వ్యక్తిగత విమర్శలకు భయపడకుండా ధైర్యంగా ముందుకు సాగాలని సూచించారు. ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన మహిళా విభాగానికి 'తెలంగాణ రుద్రమసేన'గా నామకరణం చేస్తున్నట్లు ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి ప్రతి ఇంటికీ వెళ్లి రాజ్యాంగంపై అవగాహన కల్పించాలని, నియోజకవర్గాల బాధ్యతలు చేపట్టే నాయకులు ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారం కోసం పోరాడాలని పిలుపునిచ్చారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి
- విద్యార్థులకు రాజ్యాంగం, పౌరుల హక్కులు, బాధ్యతలపై అవగాహన



హుజురాబాద్,నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి విలువలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, రాజ్యాంగాన్ని గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున, కరీంనగర్ జిల్లా కన్వీనర్ బండ నరేందర్ అన్నారు.

నవంబర్ 26 భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సమాచార హక్కు చట్టం సాధన కమిటీ - కరీంనగర్ జిల్లా టీం ఆధ్వర్యంలో హుజురాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలోని జెడ్.పి.ఎస్.హెచ్. పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో కేక్ కటింగ్ కార్యక్రమాన్ని నిర్వహించి రాజ్యాంగ దినోత్సవాన్ని ఉత్సాహంగా జరుపుకున్నారు.

అనంతరం విద్యార్థులకు భారత రాజ్యాంగ ప్రాముఖ్యత, పౌరుల హక్కులు, బాధ్యతలు, ప్రజాస్వామ్య వ్యవస్థ, సమానత్వం, స్వేచ్ఛ, న్యాయం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి కల్పించిన హక్కులను తెలుసుకోవడం, వాటిని సద్వినియోగం చేసుకోవడం, సమాజంలో ఇతరుల హక్కులను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. రాజ్యాంగ విలువలను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలి

ఈ సందర్భంగా తిరగమల్ల నాగార్జున, బండ నరేందర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులను కల్పించిందని, ప్రజాస్వామ్యానికి రాజ్యాంగమే పునాది అని పేర్కొన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక సూత్రాలను ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలని, ముఖ్యంగా విద్యార్థులు చిన్ననాటి నుంచే రాజ్యాంగంపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.

విద్యార్థులు కేవలం విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా దేశ చరిత్ర, రాజ్యాంగం, పౌరుల హక్కులు, విధుల గురించి కూడా తెలుసుకోవాలని అన్నారు. భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలంటే న్యాయం, సమానత్వం, సోదరభావం వంటి విలువలను జీవితంలో పాటించాలని తెలిపారు.

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి తన అభిప్రాయాలను వ్యక్తపరిచే స్వేచ్ఛను, సమానత్వపు హక్కులను కల్పించిందని పేర్కొన్నారు. ఈ హక్కులను గౌరవించడంతో పాటు దేశ సమగ్రత, ఐక్యతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని వివరించారు.

రాజ్యాంగ దినోత్సవం కేవలం వేడుకలకు మాత్రమే పరిమితం కాకుండా రాజ్యాంగంలోని ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రతి ఒక్కరూ సంకల్పం తీసుకోవాల్సిన రోజని తెలిపారు. విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడం ద్వారా భవిష్యత్తులో చైతన్యవంతమైన, బాధ్యతాయుతమైన పౌర సమాజాన్ని నిర్మించవచ్చని అన్నారు.

ప్రజాస్వామ్యంలో సమాచార హక్కు కీలకం

ప్రజాస్వామ్య వ్యవస్థలో సమాచార హక్కు చట్టం - 2005 ప్రజలకు ఎంతో శక్తివంతమైన సాధనమని కమిటీ ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు.

ప్రజలకు సంబంధించిన ప్రభుత్వ నిర్ణయాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చట్టబద్ధంగా సమాచారాన్ని పొందే హక్కు ప్రతి పౌరుడికి ఉందని వివరించారు. ప్రజలు తమ హక్కులను తెలుసుకొని, వాటిని సద్వినియోగం చేసుకోవడం ద్వారా ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయవచ్చని అన్నారు.

సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన కల్పించడం ద్వారా వారి కుటుంబాలు, గ్రామాల్లో కూడా చైతన్యం పెరుగుతుందని తెలిపారు. రాజ్యాంగం, సమాచార హక్కు చట్టం ప్రజలకు కల్పించిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యం

విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య విలువలను తెలియజేయడం, పౌరుల హక్కులు, బాధ్యతలపై చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కమిటీ సభ్యులు తెలిపారు.

సమాజంలో ప్రతి ఒక్కరూ రాజ్యాంగాన్ని గౌరవిస్తూ, చట్టాలను పాటిస్తూ, ఇతరుల హక్కులను పరిరక్షించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణ, సామాజిక బాధ్యత, దేశభక్తి వంటి విలువలను అలవర్చుకొని సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రాజ్యాంగ దినోత్సవ వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు, కమిటీ సభ్యులకు నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

కార్యక్రమంలో పాల్గొన్న కమిటీ సభ్యులు సమాచార హక్కు చట్టం సాధన కమిటీ కరీంనగర్ జిల్లా కన్వీనర్ బండ నరేందర్, హుజురాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరగమల్ల నాగార్జున, హుజురాబాద్ మండల కన్వీనర్ పిట్ట శ్రీనివాస్, రంగాపూర్ గ్రామ ప్రధాన కార్యదర్శి బొడ్డు కృష్ణ, రాంపూర్ గ్రామ అధ్యక్షుడు ఎర్ర రాజు, రాజపల్లె గ్రామ అధ్యక్షుడు రవీందర్, గోడిశాల గ్రామ ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని గౌరవిద్దాం - హక్కులను తెలుసుకుందాం - ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేద్దాం!

రాజ్యాంగం మన గౌరవం.. హక్కులు మన బలం.. ప్రజాస్వామ్యం మన బాధ్యత.. అనే సందేశంతో చెల్పూర్ గ్రామంలో నిర్వహించిన రాజ్యాంగ దినోత్సవ వేడుకలు విజయవంతంగా ముగిశాయి.

పార్టీ మార్పు ప్రచారంలో వాస్తవం లేదు: వివేక్ వెంకటస్వామి



హైదరాబాద్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని, పార్టీని మరింత బలోపేతం చేయడమే తన లక్ష్యమని రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో వాస్తవం లేదని ఖండించారు. గాంధీభవన్‌లో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణతో కలిసి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఇన్‌చార్జి బి.ఎం. సందీప్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిణామాలు, పార్టీ సంస్థాగత బలోపేతం, నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం, రాబోయే పార్టీ కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన పార్టీ పటిష్ఠతకు కట్టుబడి పనిచేస్తానని వెల్లడించారు. ఇటీవల అహ్మదాబాద్‌లో జరిగిన రాష్ట్రాల కార్మిక శాఖ మంత్రుల సదస్సులో తెలంగాణలో అమలు చేస్తున్న కార్మిక సంక్షేమ కార్యక్రమాలను వివరించినట్లు వివేక్ వెంకటస్వామి తెలిపారు. కనీస వేతనాల అమలు, గిగ్ కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు జాతీయ స్థాయిలో ప్రశంసలు లభించాయని చెప్పారు. అనంతరం ఢిల్లీలో జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమైనట్లు వెల్లడించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, వారి జీవన ప్రమాణాల మెరుగుదల కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని వివరించారు.గిగ్ కార్మికుల సంక్షేమం కోసం దేశానికే ఆదర్శంగా నిలిచేలా చట్టాన్ని తీసుకొచ్చామని మంత్రి పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న కనీస వేతనాల సమస్య పరిష్కారానికి వేతనాల సవరణ చేపట్టినట్లు తెలిపారు. మరోవైపు యువతకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ అందించి అంతర్జాతీయ స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కేంద్రాల నెట్‌వర్క్‌ను రాష్ట్రంలోని 119 అసెంబ్లీ నియోజకవర్గాలకు విస్తరించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. తాను పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని వివేక్ వెంకటస్వామి తీవ్రంగా ఖండించారు.సిద్ధిపేటలో పార్టీ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేశానని తెలిపారు. పార్టీలో తనకు ఎవరితోనూ వ్యక్తిగత విభేదాలు లేవని, ఏవైనా అభిప్రాయ భేదాలు ఉంటే పార్టీ వేదికపైనే చర్చించుకోవాలని అన్నారు. పార్టీ క్రమశిక్షణకు కట్టుబడి తన బాధ్యతలను నిర్వర్తిస్తానని స్పష్టం చేశారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, మంత్రి శ్రీధర్‌బాబుకు సంబంధించిన అంశంపై ప్రశ్నించగా, ప్రజా సమస్యలపై తన అభిప్రాయాన్ని వెల్లడించే సామర్థ్యం వంశీకృష్ణకు ఉందని, ఎలా ముందుకు వెళ్లాలో ఆయనే నిర్ణయించుకుంటారని చెప్పారు. ఈ విషయంలో తాను జోక్యం చేసుకోలేదని పేర్కొన్నారు.

యువతను వ్యసనాలకు దూరంగా ఉంచడమే లక్ష్యం: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి



- కిషన్ రెడ్డి ప్రారంభించిన హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్ కార్యక్రమం
- రెండో రోజు ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్‌లో కొనసాగిన అవగాహన కార్యక్రమం
- విద్యార్థులు, యువతకు క్రీడల ప్రాధాన్యత వివరించిన పుల్లెల గోపీచంద్
- మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజమంతా భాగస్వాములు కావాలని పిలుపు

హైదరాబాద్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): యువతను మాదకద్రవ్యాల వ్యసనానికి దూరంగా ఉంచి, ఆరోగ్యకరమైన జీవనశైలి వైపు ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. హైదరాబాద్‌లోని ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ వద్ద గురువారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు, యువతకు మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. వ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను జీవితంలో భాగం చేసుకోవాలని సందేశమిచ్చారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన ఈ కార్యక్రమం ద్వారా యువతలో మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావడంపై దృష్టి సారించారు. యువత భవిష్యత్తును కాపాడటం, వారిని చెడు అలవాట్లకు దూరంగా ఉంచడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తుచేస్తున్నారు. ప్రభుత్వంతో పాటు కుటుంబాలు, విద్యాసంస్థలు, సామాజిక సంస్థలు కూడా ఈ దిశగా తమ వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉందనే సందేశాన్ని కార్యక్రమం ముందుకు తీసుకెళ్తోంది.

రెండో రోజు కార్యక్రమంలో భారత బ్యాడ్మింటన్ జట్టు ప్రధాన జాతీయ కోచ్, ప్రముఖ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ పాల్గొని విద్యార్థులు, యువతకు ప్రేరణనిచ్చారు. క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని, శారీరక వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. "క్రీడలకు అవును చెప్పండి.. మాదకద్రవ్యాలకు కాదు చెప్పండి", "వ్యాయామానికి అవును చెప్పండి.. మాదకద్రవ్యాలకు కాదు చెప్పండి" అనే నినాదాలతో యువతలో చైతన్యం కల్పించారు.

క్రీడలు కేవలం శారీరక దృఢత్వానికే కాకుండా క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం పెంపొందించడానికి కూడా ఉపయోగపడతాయి. యువత తమ శక్తి సామర్థ్యాలను సానుకూల మార్గాల్లో వినియోగించుకోవాలని, వ్యసనాలకు ఆకర్షితులు కాకుండా లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టాలని కార్యక్రమం ద్వారా సూచించారు. ఆరోగ్యకరమైన అలవాట్లను చిన్న వయసు నుంచే అలవరుచుకోవడం ద్వారా వ్యక్తిగత జీవితంతో పాటు సమాజానికి కూడా మేలు జరుగుతుందని సందేశమిచ్చారు. మాదకద్రవ్యాల వ్యసనం యువత భవిష్యత్తుపై ప్రభావం చూపకుండా అడ్డుకోవడానికి సమష్టి కృషి అవసరం. ప్రతి ఒక్కరూ తమ పరిధిలో అవగాహన కల్పిస్తూ, యువతకు సరైన మార్గనిర్దేశం చేయాలని కార్యక్రమం పిలుపునిచ్చింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రారంభించిన ఈ నషా ముక్త్ భారత్ ప్రచారంలో భాగంగా రెండో రోజు పుల్లెల గోపీచంద్ పాల్గొని క్రీడలు, వ్యాయామం ద్వారా ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి సహకరించాలని యువతకు పిలుపునిచ్చారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 27 - నవంబర్ 2026

అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన జమ్ముల



ఖమ్మం బ్యూరో, నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): చింతకాని మండలం చిన్నమండవ గ్రామంలో సీపీఐ జాతీయ సమితి పిలుపు మేరకు రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి గ్రామంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ పీఠికను సామూహికంగా పఠించారు. రాజ్యాంగాన్ని రక్షించాలని,ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని, బీజేపీ అనుసరిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక విధానాలు, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలను ప్రజల్లో ఎండగట్టాలని.రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు,సిపిఐ జిల్లా సమితి సభ్యులు పర్సా రామచంద్రరావు,సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి తుపాకుల లక్ష్మీనారాయణ, సిపిఐ మండల నాయకులు గుండ్ల బేబీరాణి,తాళ్లూరి యాదగిరి,రాచకొండ అంజయ్య,తుపాకుల సైదులు, గుండ్ల భద్రమ్మ,బండి శీను,కోయా అప్పారావు ,మద్యాల అంజయ్య గుండ్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు

రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించిన బ్రెయినీ స్టార్స్ మాంటిస్సోరి పాఠశాల



ఖమ్మం బ్యూరో , నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ఖమ్మంలోని వి డి యో స్ కాలనీ, గట్టయ్య సెంటర్‌లో ఉన్న బ్రెయినీ స్టార్స్ మాంటిస్సోరి పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జైనుల్ పాషా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం మరియు సమానత్వాన్ని కల్పిస్తుందని వివరించారు. భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యంత విశిష్టమైన లిఖిత రాజ్యాంగాలలో ఒకటని, ప్రతి పౌరుడు రాజ్యాంగం పట్ల గౌరవం కలిగి ఉండాలని సూచించారు. విద్యార్థులు చిన్నతనం నుంచే రాజ్యాంగ విలువలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి ఆదర్శాలను అలవర్చుకోవాలని, కులమత భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయునీలూ, శైలజ, నీలిమ, నాగమణి, మాధవి, అబ్బానీ, సల్మా, కలైవాణి, కళ్యాణి, రజియా మరియు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉపాధ్యాయులు రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను మరియు రాజ్యాంగ ప్రవేశికను విద్యార్థులకు వివరించగా, విద్యార్థులు రాజ్యాంగ విలువలను తెలుసుకుని, వాటిని తమ జీవితాల్లో పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఖమ్మం డిపోలో హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమం



ఖమ్మం బ్యూరో, నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, కరీంనగర్ వారి ఆదేశాల మేరకు టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం డిపోలో ఉద్యోగుల ఆరోగ్యంపై అవగాహన కల్పించేందుకు హెల్త్ అవేర్‌నెస్ కార్యక్రమం నిర్వహించారు.

ఖమ్మం డిపో మేనేజర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో, టీజీఎస్ఆర్టీసీ ఖమ్మం డిపో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సింధు ఉద్యోగులకు ఆరోగ్య పరిరక్షణపై పలు ముఖ్యమైన సూచనలు, సలహాలు అందించారు.

ఈ సందర్భంగా ముఖ్యంగా డ్రైవర్లు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ధూమపానం, మద్యం వంటి అలవాట్లకు దూరంగా ఉండాలని, ప్రతిరోజూ వ్యాయామం చేయాలని, క్రమం తప్పకుండా ఆరోగ్యకరమైన ఆహార నియమాలను పాటించాలని సూచించారు.

డ్రైవర్ల విధుల్లో ఆరోగ్యం ఎంతో కీలకమని, శారీరకంగా మరియు మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే ప్రయాణికులకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించగలరని వివరించారు. ఉద్యోగులందరూ ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహిస్తూ, వైద్యుల సూచనలు పాటించాలని డాక్టర్ సింధు సూచించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం డిపో అధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు తదితరులు పాల్గొన్నారు.





వాహనాల విక్రయాలపై శ్రద్ధ.. సర్వీసింగ్ లో అశ్రద్ధ..?

- **సర్వీసింగ్‌కు వెళ్తే.. వాహనం తిరిగి వచ్చేది ఎప్పుడో?**
- **చిన్నపాటి మరమ్మతులకే రెండు, మూడు రోజుల జాప్యమెందుకు..?**
- **ఉద్యోగులు, వ్యాపారులకు తప్పని నిర్లక్ష్యపు టీవీఎస్ సర్వీస్ సర్వీసింగ్ విధానం..!**
- **టీవీఎస్ తులసీ యాజమాన్యం తక్షణమే స్పందించి సర్వీసింగ్ ను మెరుగుపరచాలి..**

మౌలాలి, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు):వాహనాల విక్రయాల సమయంలో చూపుతున్న ఉత్సాహం.. విక్రయానంతర సేవల్లోనూ కనిపిస్తోందా? లక్షల రూపాయలు వెచ్చించి వాహనాలను కొనుగోలు చేస్తున్న వినియోగదారులకు సకాలంలో సర్వీసింగ్ అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయా? మౌలాలిలోని టీవీఎస్ తులసీ షోరూంలో సర్వీసింగ్ సేవల తీరుపై వినియోగదారుల నుంచి ఇలాంటి ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.ముఖ్యంగా టీవీఎస్ విద్యుత్ ద్విచక్ర వాహనాల సర్వీసింగ్‌లో తీవ్ర జాప్యం జరుగుతోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. చిన్నపాటి మరమ్మతుల కోసం వాహనాలను షోరూంకు తీసుకెళ్లినా వెంటనే మరమ్మతులు పూర్తి చేసి అప్పగించడం లేదని, రెండు, మూడు రోజుల పాటు షోరూంలోనే ఉంచుతున్నారని వాపోతున్నారు. సర్వీసింగ్ విభాగంలో తగినంత మంది సిబ్బంది లేకపోవడం, సాంకేతిక నిపుణుల కొరత కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని వినియోగదారులు అభిప్రాయపడుతున్నారు.

వాహనం లేక రోజువారీ ఇబ్బందులు పడుతున్న వినియోగదారు..

ఉద్యోగ, వ్యాపార, వ్యక్తిగత అవసరాల కోసం నిత్యం ద్విచక్ర వాహనాలపై ఆధారపడే వారికి రోజుల తరబడి వాహనాలు షోరూంలోనే ఉండిపోవడం తీవ్ర ఇబ్బందిగా మారుతోంది. ప్రత్యామ్నాయ రవాణా కోసం అదనపు ఖర్చులు భరించాల్సి వస్తోందని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆధునిక సాంకేతికతతో కూడిన విద్యుత్ వాహనాలను కొనుగోలు చేసినప్పటికీ, అవసరమైన సమయంలో సర్వీసింగ్ సేవలు అందుబాటులో లేకపోవడంతో వాటి వినియోగ ప్రయోజనం దెబ్బతింటోందని అసహనం వ్యక్తం చేస్తున్నారు.

విక్రయాలకే ప్రాధాన్యమా.. సేవలకు లేదా పనితనం..?

వాహనాల విక్రయాల సమయంలో చూపుతున్న శ్రద్ధను విక్రయానంతర సేవల్లోనూ ప్రదర్శించాలని వినియోగదారులు డిమాండ్ చేస్తున్నారు. సర్వీసింగ్ విభాగంలో తగినంత మంది సిబ్బందితో పాటు నైపుణ్యం కలిగిన సాంకేతిక నిపుణులను నియమించి, మరమ్మతులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని కోరుతున్నారు. సర్వీసింగ్ కోసం వచ్చిన వాహనాలను అనవసరంగా రోజుల తరబడి నిలిపివేయకుండా, సాధ్యమైనంత త్వరగా వినియోగదారులకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా టీవీఎస్ తులసీ షోరూం యాజమాన్యం స్పందించి, విక్రయానంతర సేవల నాణ్యతను మెరుగుపరచాలని వినియోగదారులు కోరుతున్నారు.

వైద్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ రామారావు

ఖమ్మం బ్యూరో , నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రామారావు గురువారం చింతకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో అమలవుతున్న వివిధ ఆరోగ్య కార్యక్రమాల పనితీరును సమీక్షించడంతో పాటు, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు.





ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులు, ఇతర రోగులతో నేరుగా మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ తీరును అడిగి తెలుసుకున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం వినియోగిస్తున్న 102 వాహనం పనితీరుపై సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రమాదకర గర్భధారణ కేసులను ముందుగానే గుర్తించి, వారికి ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అందించాలని ఆదేశించారు. జ్వర బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేస్తూ, అవసరమైన వైద్య చికిత్స అందించాలని సూచించారు. ఆసుపత్రిలో సిరంజీల కొరత లేకుండా అవసరమైన నిల్వలను ముందుగానే సమకూర్చుకోవాలని ఆదేశించారు.అనంతరం నేరెడ గ్రామంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని, పెద్దగోపతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, అక్కడ నమోదైన గర్భిణుల వివరాలు, సంబంధిత వైద్య రికార్డులను పరిశీలించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా డాక్టర్ రామారావు సూచించారు.

ముల్కనూర్ ప్రధాన రహదారులపై ప్రమాద ఘంటికలు!

- **రోడ్లను ఆక్రమించిన దుకాణాలు.. అడ్డుగా ట్రాన్స్‌ఫార్మర్**
- **అస్తవ్యస్త పార్కింగ్‌తో అగచాట్లు.. నిత్యం ట్రాఫిక్ కష్టాలు**
- **ప్రమాదాలు జరిగే వరకు అధికారులకు చలనం లేదా?**

భీమదేవరపల్లి, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ గ్రామంలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్ సమస్యలు రోజురోజుకూ తీవ్రమవుతున్నాయి. అంబేద్కర్ సర్కిల్ నుంచి కొత్తకొండ వెళ్లే మార్గంతో పాటు. హుస్నాబాద్, హనుమకొండ పట్టణాలకు వెళ్లే ప్రధాన రహదారుల వెంట దుకాణాల విస్తరణ, అస్తవ్యస్త వాహనాల పార్కింగ్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారులపై ఆక్రమణలు, ట్రాఫిక్ నియంత్రణ లోపం వాహనదారులకు నిత్య సమస్యగా మారాయి.

రోడ్డుపైనే దుకాణాల విస్తరణ.. రాకపోకలకు ఆటంకం

కొన్ని దుకాణాలు రహదారి అంచుల వరకు విస్తరించడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. మరోవైపు హనుమకొండ వైపు వెళ్లే ప్రధాన రహదారిపై నేట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వాహనదారులకు ప్రమాదకరంగా మారుతోంది. రద్దీ సమయాల్లో వాహనాలు ఎదురెదురుగా వెళ్లేందుకు కూడా సరిపడా స్థలం లేక ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.





రహదారులపైనే వాహనాల పార్కింగ్

దుకాణాల ముందు, రహదారుల పక్కన ద్విచక్ర వాహనాలు, కార్లను ఇష్టానుసారంగా నిలిపివేస్తుండటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముఖ్యంగా కొత్తకొండ వైపు వెళ్లే భక్తులు,ప్రయాణికులు, స్థానిక ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. పాదచారులు సైతం వాహనాల మధ్య నుంచే ప్రమాదకరంగా రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రమాదం జరిగితే బాధ్యులెవరు?

గ్రామపంచాయతీ, పోలీస్, విద్యుత్, సంబంధిత రహదారుల శాఖ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. రహదారులపై ఆక్రమణలను నియంత్రించడం, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టడం, వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించడం వంటి చర్యలు తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రమాదం జరిగాకే స్పందిస్తారా?

ప్రజల రాకపోకలకు సౌకర్యంగా ఉండాల్సిన ప్రధాన రహదారులు ట్రాఫిక్ సమస్యలకు కేంద్రాలుగా మారుతుండటం పట్ల స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వేలాది మంది రాకపోకలు సాగించే ఈ మార్గాల్లో సమస్యలను ముందుగానే గుర్తించి పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమగ్ర పరిశీలనతో శాశ్వత పరిష్కారం చూపుతారా? లేక ఏదైనా ప్రమాదం జరిగిన తర్వాతే చర్యలు చేపడతారా? అన్నది స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

డప్పు చప్పుళ్లతో దీక్షా దివస్ సభకు గంగుల ఆహ్వానం

- **తెలంగాణ చౌక్‌లో ప్రచారం.. అలుగునూరు సభకు భారీగా తరలిరావాలని పిలుపు**

కరీంనగర్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): ఈ నెల 29న అలుగునూరులో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న దీక్షా దివస్ సభను విజయవంతం చేయాలని మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రజలకు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు కరీంనగర్ నియోజకవర్గంలోని తెలంగాణ చౌక్‌లో డప్పు చప్పుళ్లతో ప్రచారం నిర్వహిస్తూ సభకు ప్రజలను ఆహ్వానించారు. ఈ సందర్భంగా గంగుల కమలాకర్ మాట్లాడుతూ తెలంగాణ భూమి ఉన్నంతకాలం తెలంగాణ చరిత్రలో కేసీఆర్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమ చరిత్రలో కేసీఆర్ పాత్ర కీలకమని, తెలంగాణ శిఖరం కేసీఆర్ అని అన్నారు. చారిత్రాత్మక తెలంగాణ పోరాట స్ఫూర్తిని, అమరవీరుల త్యాగాలను, ఉద్యమకారుల పోరాటాలను మరోసారి స్మరించుకునేందుకు అలుగునూరులో నిర్వహించే దీక్షా దివస్ సభకు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఈ సభను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ ప్రచార కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



- **ప్రజారోగ్యమే లక్ష్యంగా సేవా కార్యక్రమం..**
- **మధుమేహం,రక్తపోటు పరీక్షలు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని పిలుపు.**

కరీంనగర్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): కరీంనగర్‌లోని పోచమ్మ గుడి వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ లక్ష్మీనగర్, లయన్స్ క్లబ్ ఆఫ్ స్మార్ట్ సిటీ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మధుమేహం, రక్తపోటు పరీక్షలతో పాటు చక్కెర వ్యాధి నిర్ధారణకు సంబంధించిన పరీక్షలు నిర్వహించి, బికాంప్లెక్స్ సిరప్‌లను పంపిణీ చేశారు. మున్సిపల్ సిబ్బందికి సైతం వైద్య పరీక్షలు నిర్వహించి సిరప్‌లను అందజేశారు.
ఈ సందర్భంగా 39వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ మాసం గణేష్ మాట్లాడుతూ.. నేటి సమాజంలో ప్లాస్టిక్ వినియోగం విపరీతంగా పెరిగిపోతోందని, ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు ప్రజారోగ్యానికి కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు గుడ్డ సంచులు, స్టీల్ టిఫిన్ బాక్సులు వంటి ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. ప్రజల్లో ప్లాస్టిక్ వినియోగంపై అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సేవా కార్యక్రమంలో తనను భాగస్వామిని చేసి ఆహ్వానించిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు మాసం గణేష్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం నిర్వహించే మరిన్ని సేవా కార్యక్రమాలకు తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్మార్ట్ సిటీ అధ్యక్షులు ఆర్. ప్రభాకర్ రెడ్డి ఎంజేఎఫ్, లయన్స్ క్లబ్ ప్రతినిధి పెద్దిరఘునాథ్ ఎంజేఎఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 77వ భారత రాజ్యాంగ దినోత్సవం



- **భారత రాజ్యాంగ పరిరక్షణకు యువత ముందుకు రావాలి..**

కాప్రా, నవంబర్26,(తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు ఈసీఐఎల్ చౌరస్తాలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం దగ్గర భారత రాజ్యాంగం సమర్పించిన రోజు అంటే రాజ్యాంగ దివస్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను సభ్యులందరూ చేయడం జరిగింది. రాజ్యాంగ దివస్ కార్యక్రమాన్ని స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముందుగా బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి ఎస్సీ ఎస్టీ ఈ ఆర్ పి ఎస్ నాయకులు సిహెచ్ నాగేశ్వరరావు బృందం,స్ఫూర్తి గ్రూప్ నాయకులు గగన్ కుమార్, కృష్ణమాచార్యులు తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షులు గొడుగు యాదగిరిరావు మాట్లాడుతూ..భారత రాజ్యాంగాన్ని ప్రపంచంలోనే అత్యున్నతంగా బాబాసాహెబ్ అంబేద్కర్ రూపొందించారని అన్నారు. ప్రజలకు అవసరమైనటువంటి విధంగా అందరికీ సమాన హక్కులు కల్పిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించారు. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించి వారిని సైతం పైకి తీసుకురావడం కోసం రాజ్యాంగంలో పొందుపరిచారని అన్నారు. ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు కోమటి రవి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని ఎంతో కష్టనష్టాలతో ప్రజలందరికీ ప్రయోజనాల కొరకు రూపొందించారని చెప్పారు. భారత రాజ్యాంగం గొప్పతనాన్ని యుఎన్ఓ అధ్యక్షుడు గుట్రాస్ కూడా అభినందించడం జరిగింది. నేటి పాలకులు భారత రాజ్యాంగాన్ని పూర్తిగా తూట్లు పొడిచి మనుస్మృతిని మన రాజ్యాంగం స్థానంలో తీసుకురావాలని కుట్ర పన్నుతున్నారు అని అన్నారు. ప్రజాస్వామ్యానికి ప్రాణమైనటువంటి ఓటు హక్కును దాదాపు 13 కోట్లకు పైగా భారత పౌరుల ఓట్లను తీసివేసి ఎల్ల కాలం తామే పరిపాలన చేయాలని కుట్ర పన్నుతున్నారు దాన్లో ముఖ్యంగా బడుగు బలహీన వర్గాలకు మైనార్టీలకు చెందిన వారిని తొలగించడం జరిగింది. దానికి వ్యతిరేకంగా అనేక పోరాటాలు జరుగుతున్నాయి. వాటి అన్నిట్లో మన మందరం భాగస్వాములు కావాలని కోరారు. స్ఫూర్తి గ్రూప్ నాయకులు, సమాచార హక్కు చట్టం అమలు కార్యకర్త గగన్ కుమార్ మాట్లాడుతూ.. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకోవాలని కోరారు.చల్లా లీలావతి, కృష్ణమాచార్యులు, సిహెచ్ నాగేశ్వరరావు, మురారి, దేవేందర్, ప్రభు దాస్, ప్రసంగించారు. అనంతరం సామాజిక ఉద్యమ నేత జయరాజు సభ్యులందరికీ చేత రాజ్యాంగ పీఠిక ప్రతిజ్ఞను చేయించడం జరిగింది.రాజ్యాంగం వర్ధిల్లాలి బాబాసాహెబ్ అంబేద్కర్ అమర్ రహే, రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అని నినాదాలు చేయడం జరిగింది. చివరగా పులి అంబేద్కర్ స్ఫూర్తి గ్రూపు నాయకులు గద్దల నరసింహారావు అంబేద్కర్ పై అద్భుతంగా పాటను ఆలపించారు. అనంతరం వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది. ఈ కార్యక్రమంలో శ్రీమన్నారాయణ, శివన్నారాయణ, ఉదయ భాస్కర్, లక్ష్మయ్య, సిహెచ్ లీలావతి, గొడుగు ప్రవీణ, శారద, విమలాదేవి, హెచ్ వి స్వామి, కోమటి రవి, నవతెలంగాణ రవి, జయరాజ్, బొమ్మగాని రుక్కయ్య, గగన్ కుమార్, గద్దల నరసింహారావు, సిహెచ్ నాగేశ్వరరావు, మురారి, నిరుకొండ సతీష్ బాబు, గొట్టముక్కల నరసింహ చారి, నాగేష్, బాలరాజు, దేవేందర్, పి. యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్‌కు ఘన నివాళులు

- **బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం నుంచి కోర్టు చౌరస్తా వరకు భారీ ర్యాలీ.**



కరీంనగర్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): భారత 77వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ కార్యాలయం నుంచి కోర్టు చౌరస్తా వరకు భారీ ర్యాలీ చేపట్టారు. రాజ్యాంగ నిర్మాత భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సేవలను స్మరించుకుంటూ నాయకులు, కార్యకర్తలు ‘జై భీమ్’, ‘భారత్ మాతా కీ జై’ నినాదాలతో ర్యాలీగా తరలివెళ్లారు.
అనంతరం కోర్టు చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారతదేశానికి సమగ్రమైన రాజ్యాంగాన్ని అందించిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ అని కొనియాడారు. కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా ప్రతి పౌరుడికి సమాన హక్కులు, సామాజిక న్యాయం, స్వేచ్ఛను కల్పించిన రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అంబేద్కర్ ఆశయ సాధనకు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బీజేపీ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. యువత రాజ్యాంగ విలువలను అధ్యయనం చేసి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ మేయర్, ప్రస్తుత డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కన్నబోయిన ఓదెలు, నాగేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గుజ్జ శ్రీనివాస్, కార్పొరేటర్లు వాసాల రమేష్, వేముల చంద్రశేఖర్, బండారి వేణు, సోమిడి వేణు, ఏపీపీ చంద్ర (టింకు), ఎన్నం ప్రకాష్, కాంపెల్లి రామన్, మాసం గణేష్, కొలిపాక శ్రీనివాస్‌తో పాటు ఎస్సీ మోర్చా నాయకులు, వివిధ మోర్చాల ప్రతినిధులు, సీనియర్ నాయకులు, మహిళా మోర్చా సభ్యులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వడ్లూరులో కాలభైరవ స్వామి ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొన్న హరీశ్ రావు, రసమయి

- **బెజ్జంకి వద్ద బీఆర్ఎస్ శ్రేణుల ఘన స్వాగతం.. అంబేద్కర్ విగ్రహానికి నివాళులు.**



మానకొండూర్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): మానకొండూర్ నియోజకవర్గంలోని బెజ్జంకి మండలం వడ్లూరు గ్రామంలో నిర్వహించిన శ్రీ స్వయంభూ కాలభైరవ స్వామి, అధిష్ఠాన ప్రత్యంగిరాదేవి దేవస్థానం ప్రతిష్ఠా మహోత్సవంలో మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు, మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు.
ఈ సందర్భంగా బెజ్జంకి ఎక్స్ రోడ్డు వద్ద బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో హరీశ్ రావు, రసమయి బాలకిషన్‌లకు ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, పార్టీ శ్రేణులు పెద్దఎత్తున ఘన స్వాగతం పలికారు.
అనంతరం వడ్లూరు గ్రామంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి ర్యాలీని ప్రారంభించారు.
ఈ సందర్భంగా హరీశ్ రావు, రసమయి బాలకిషన్ మాట్లాడుతూ సనాతన ధర్మంలో పరమశివుడి ఉగ్రరూపాల్లో కాలభైరవుడు అత్యంత శక్తివంతమైన దైవమని పేర్కొన్నారు. కాలం అంటే శివుడు, భైరవుడు అంటే భయాన్ని పోగొట్టేవాడని వివరించారు. కాలాన్ని తన ఆధీనంలో ఉంచుకుని భక్తుల భయాలను తొలగించే కాలభైరవ స్వామి ప్రతిష్ఠా మహోత్సవంలో పాల్గొనడం పూర్వ జన్మసుకృతంగా భావిస్తున్నామని తెలిపారు. కాలభైరవ స్వామి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండి, ప్రతి ఒక్కరూ సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో కరీంనగర్ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావుతో పాటు బెజ్జంకి మండల బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సంవిధాన్ రక్షా మార్చ్ రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు





దమ్మాయిగూడ, నవంబర్26(తెలంగాణ ముచ్చట్లు): రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఏఐసీసీ పిలుపు మేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన సంవిధాన్ రక్షా మార్చ్ - రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలో కీసర సర్కిల్ పరిధి 4వ డివిజన్ దమ్మాయిగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పరామారావు, మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్,కాంగ్రెస్ పార్టీ బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ ఈగ శ్వేతా రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరైనారు. ట్యాంక్ బండ్ వద్ద ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని రాజ్యాంగ పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలిపారు.ఈ సందర్భంగా రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల సంరక్షణ, సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ వంటి రాజ్యాంగ మౌలిక సూత్రాల ప్రాధాన్యతను చాటిచెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుతూ ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్.జీ.కే కాలనీ నుంచి 4వ డివిజన్ బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి ముద్దసాని నరేష్, సులోచన, దర్శిని, సైదా, రాధాకృష్ణ, పాక రాము, జనార్ధన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.





వైభవంగా శ్రీశ్రీశ్రీ హరిహరపుత్ర అయ్యప్పస్వామి కత్తిస్వామి మహా పడిపూజ

నాగారం, నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లోని మల్లికార్జున కాలనీ (బంగారు మైసమ్మ దేవాలయం సమీపంలో) గురువారం నాడు శ్రీశ్రీశ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి కత్తిస్వామి మహా పడిపూజ అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించబడింది. గురువారం
నిమ్మల రాఘవేందర్ ఆధ్వర్యంలో ఉదయం 9:00 గంటలకు ప్రారంభమైన ఈ మహా పడిపూజ కార్యక్రమాన్ని పూజారి శివకార్తీక్ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ వేడుకలో వెంకటేష్ గురుస్వామి, నర్సింహా గురుస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గాయకులు మిర్యాల లింగం (సింగర్) ఆలపించిన అయ్యప్ప భక్తి గీతాలు భక్తులను ఎంతగానో అలరించాయి.
ఈ పవిత్ర కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి,మాజీ వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్,మాజీ కౌన్సిలర్ అనంతరెడ్డి,మెరుగు శ్రీనివాస్ రెడ్డి, శ్రీకాంత్ యాదవ్,నాగేందర్,స్థానిక నాయకులు విచ్చేసి స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 27 - నవంబర్ 2026

ఆలయాల అభివృద్ధికి రూ.21వేలు విరాళంగా అందించిన ముప్పు శ్రీనివాస్ రెడ్డి



నాగారం, నవంబర్26(తెలంగాణ ముచ్చట్లు): ఘట్కేసర్ సర్కిల్ పరిధి నాగారం డివిజన్ లోని రాజ్ సుఖ్ నగర్ కాలనీలో ఉన్న నల్లపోచమ్మ అమ్మవారి ఆలయం, సాయిబాబా ఆలయం, శివాలయం అండ్ ఆంజనేయ స్వామి ఆలయాలకు షెడ్ నిర్మాణ పనుల నిమిత్తం నాగారం డివిజన్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి విరాళంగా రూ.21,000/ (ఇరవై ఒక్క వేల రూపాయలు) ఆర్థిక సహాయం అందజేశారు. ఆలయాల అభివృద్ధి కోసం మాజీ నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ముప్పు శ్రీనివాస్ రెడ్డి తన వంతు సహకారం అందించడం పట్ల స్థానిక కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాగారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భూమయ్య యాదవ్, యువ నాయకులు కౌకుట్ల జీవన్ రెడ్డి, దాసరి రాంరెడ్డి,రామగోని శ్రీనివాస్ గౌడ్, దాసోహం నర్సింహారావు,పంగ సంతోష్,షేక్ గౌస్, బాబూరావు,మాది రెడ్డి రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ చార్జీతో డీలక్స్ ప్రయాణం

- **సత్తుపల్లి–ఖమ్మం మార్గంలో ప్రతి 20 నిమిషాలకు బస్సు.**
- **డీలక్స్ సర్వీసుల్లోనూ మంత్లీ సీజన్ టికెట్లు.**
- **డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ వెల్లడి.**



సత్తుపల్లి, నవంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు): సత్తుపల్లి-ఖమ్మం మధ్య ప్రయాణించే వారికి ఆర్టీసీ మరింత వెసులుబాటు కల్పించింది. ఈ మార్గంలో ప్రతి 20 నిమిషాలకు ఒక డీలక్స్ బస్సు నడిపేలా ఏర్పాట్లు చేసినట్లు సత్తుపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ తెలిపారు. ఎక్స్‌ప్రెస్ బస్సు చార్జీలతోనే డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే అవకాశం కల్పించినట్లు గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ప్రయాణికులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీలక్స్ బస్సుల్లోనూ మంత్లీ సీజన్ టికెట్లను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. 20 రోజుల చార్జీతో 30 రోజులపాటు ప్రయాణించే అవకాశం ఉందన్నారు. రెండు నెలల సీజన్ టికెట్ తీసుకున్నవారికి అదనంగా ఐదు రోజులు, మూడు నెలల టికెట్ తీసుకున్నవారికి పది రోజుల అదనపు ప్రయాణ సౌకర్యం కల్పించినట్లు వివరించారు. మహిళలు 15 రోజుల చార్జీతో 30 రోజులు ప్రయాణించేలా సీజన్ టికెట్ విధానాన్ని సవరించినట్లు వెల్లడించారు. సీజన్ టికెట్ కలిగిన ప్రయాణికులు ఆదివారం సిటీలో ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అంతేకాకుండా రూటుతో సంబంధం లేకుండా సూపర్ లగ్జరీ బస్సుల్లో బేసిక్ చార్జీపై పది శాతం రాయితీతో ప్రయాణించే వెసులుబాటు కల్పించినట్లు పేర్కొన్నారు.

సత్తుపల్లి నుంచి ఖమ్మంకు వెళ్లే డీలక్స్ బస్సుల సమయాలు: ఉదయం 6.00, 6.20, 6.40, 7.00, 7.20, 7.40, 8.00, 8.20, 8.40, 9.00, 10.20, 10.40, 11.00, 11.20, 11.40, 12.00, 12.20, 12.40, 13.00, 13.20, 14.40, 15.00, 15.20, 15.40, 16.00, 16.20, 16.40, 17.00, 17.20, 17.40 గంటలకు.

ఖమ్మం నుంచి సత్తుపల్లికి వచ్చే డీలక్స్ బస్సుల సమయాలు: ఉదయం 8.10, 8.30, 8.50, 9.10, 9.30, 9.50, 10.10, 10.30, 10.50, 11.10, 12.30, 12.50, 13.10, 13.30, 13.50, 14.10, 14.30, 14.50, 15.10, 15.30, 16.50, 17.10, 17.30, 17.50, 18.10, 18.30, 18.50, 19.10, 19.30, 19.50 గంటలకు.

సత్తుపల్లి-ఖమ్మం మధ్య రాకపోకలు సాగించే ప్రయాణికులు ఎక్స్‌ప్రెస్ చార్జీలతో డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే సౌకర్యాన్ని, సీజన్ టికెట్లపై కల్పిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ గురిజాల లక్ష్మీనారాయణ కోరారు.

29న రవీంద్రభారతిలో 'కాలగమనం' పుస్తకావిష్కరణ

- **పలుస శంకర్ గౌడ్, జిల్లా సాహితీ కళావేదిక అధ్యక్షులు**



ప్రముఖ కవయిత్రి డా. రూప రచించిన 'కాలగమనం' గేయ కవితా సంపుటి పుస్తకావిష్కరణ సభ ఈ నెల 29న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు సాహితీ కళా వేదిక వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శంకర్ గౌడ్ తెలిపారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, వనపర్తి సాహితీ సమితి, సాహితీ కళా వేదిక వనపర్తి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు రవీంద్రభారతి మొదటి అంతస్తులోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. సభకు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డా. జూరు చెన్నయ్య అధ్యక్షత వహించనుండగా, ముఖ్య అతిథిగా తెలంగాణ వ్యవసాయ శాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, విశిష్ట అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డా. ఏనుగు నరసింహా రెడ్డి, ఐఏఎస్ హాజరుకానున్నారు. తెలంగాణ వికాస సమితి రాష్ట్ర అధ్యక్షులు వనపట్ల సుబ్బయ్య పుస్తక పరిచయం చేయనున్నారు. గౌరవ అతిథులుగా కె. ఆనందాచారి, డా. ఎస్. రఘు, కోట్ల వెంకటేశ్వర రెడ్డి, ఆత్మీయ అతిథులుగా సాహితీ కళా వేదిక అధ్యక్షులు పి. శంకర్ గౌడ్, భూక్యా శ్రీను నాయక్, సి. శ్రీనివాస్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా పలుస శంకర్ గౌడ్ మాట్లాడుతూ, సాహిత్యాభిమానులు, కవులు, రచయితలు పెద్ద సంఖ్యలో హాజరై పుస్తకావిష్కరణ సభను విజయవంతం చేయాలని కోరారు.

భారత రాజ్యాంగం - దేశ ఆత్మకు ప్రతిరూపం

- **మహోన్నత గ్రంథం మన భారత రాజ్యాంగం.**
- **రాజ్యాంగం కల్పించిన హక్కులే ప్రజాస్వామ్యానికి అసలైన పునాది: హెచ్.ఆర్. మోహన్**



హైదరాబాద్, నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): ఏఐసీసీ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు శ్రీ బి. మహేష్ కుమార్ గౌడ్ గారి ఆదేశాల మేరకు, ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీ మందుముల పరమేశ్వర్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలివెళ్లి హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై నిర్వహించిన భారత రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి హెచ్.ఆర్. మోహన్ మాట్లాడుతూ..

భారత రాజ్యాంగం కేవలం ఒక పుస్తకం కాదు.. ఈ దేశ ఆత్మకు ప్రతిరూపం. కోట్లాది అణగారిన ప్రజల ఆశలకు ప్రతీక. సమానత్వం, సామాజిక న్యాయానికి దిక్సూచి అని అన్నారు. 1949 నవంబర్ 26న భారత రాజ్యాంగాన్ని రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన చారిత్రాత్మక సందర్భాన్ని పురస్కరించుకుని నేడు దేశవ్యాప్తంగా రాజ్యాంగ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని తెలిపారు. భారత దేశానికి 1947 ఆగస్టు 15న స్వాతంత్ర్యం వచ్చిన అనంతరం, ప్రజలందరికీ సమాన హక్కులు కల్పిస్తూ ప్రజాస్వామ్య భారతదేశ నిర్మాణానికి పునాది వేసిన మహోన్నత గ్రంథం మన భారత రాజ్యాంగం.

రాజ్యాంగ రూపకల్పనకు 2 సంవత్సరాల 11 నెలల 18 రోజుల పాటు ఎంతో శ్రమించి, ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత రాజ్యాంగాల్లో ఒకటిగా భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన కృషి చరిత్రలో చిరస్మరణీయం.

స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం అనే గొప్ప ఆశయాలతో రూపొందిన మన రాజ్యాంగం దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాలు, మహిళలు, పేదలు, అణగారిన వర్గాలకు ఆత్మగౌరవంతో జీవించే హక్కును కల్పించింది.

విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యం, సమాన అవకాశాలు, భావప్రకటన స్వేచ్ఛ వంటి అనేక హక్కులకు రాజ్యాంగమే రక్షణ కవచం. వేల సంవత్సరాలుగా సామాజిక వివక్షకు గురైన అట్టడుగు వర్గాలకు సమాన హక్కులు కల్పించి, మనుషులందరూ సమానమేనని చాటిచెప్పిన మహనీయుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్.

రాజ్యాంగం మనకు ఇచ్చిన హక్కులను కాపాడుకోవడం మాత్రమే కాదు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలను కూడా ప్రతి పౌరుడు గౌరవించాలి. ప్రజాస్వామ్య వ్యవస్థను, రాజ్యాంగ సంస్థలను, లౌకికవాదాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుడి బాధ్యత.

రాజ్యాంగం బలంగా ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది. ప్రజాస్వామ్యం బలంగా ఉంటేనే సామాన్యుడికి న్యాయం జరుగుతుంది. అంబేద్కర్ ఆశయాల సాధనే సమ సమాజ నిర్మాణానికి మార్గం.

రాజ్యాంగమే మనకు రక్షణ.. రాజ్యాంగమే మనకు సమానత్వం.. రాజ్యాంగమే మన భవిష్యత్తు! ఈ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌కు హృదయపూర్వక జోహార్లు అర్పిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో ఆచరించాలని హెచ్.ఆర్. మోహన్ పిలుపునిచ్చారు.

ప్రజలే కుటుంబం– ప్రజా సేవే ధ్యేయం– అభివృద్ధే లక్ష్యం పుస్తక ఆవిష్కరణ

- **ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మూడు సంవత్సరాల ప్రజా ప్రస్థానంపై పీఏ ఆలేటి రమేష్ రచించిన పుస్తక ఆవిష్కరణ..**



ఉప్పల్,నవంబర్26,(తెలంగాణ ముచ్చట్లు): ఉప్పల్ నియోజకవర్గం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను పురస్కరించుకుని, ఎమ్మెల్యేగా ఆయన గత మూడు సంవత్సరాల ప్రజా ప్రస్థానం, ప్రజాసేవ, నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలతో ఆయనకున్న అనుబంధాన్ని ప్రతిబింబిస్తూ ఆయన వ్యక్తిగత సహాయకుడు పీఏ ఆలేటి రమేష్ రచించిన "ప్రజలే కుటుంబం - ప్రజా సేవే ధ్యేయం - అభివృద్ధే లక్ష్యం" అనే ప్రత్యేక పుస్తకాన్ని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గురువారం ఆవిష్కరించారు.ఎమ్మెల్యేగా మూడు సంవత్సరాలుగా ఉప్పల్ నియోజకవర్గ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం బండారి లక్ష్మారెడ్డి సాగించిన ప్రయాణం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం చేసిన కృషి, నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా ముందుకు సాగిన తీరు వంటి అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. ప్రజా ప్రతినిధిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజలే తన కుటుంబంగా భావిస్తూ, ప్రజా సేవను తన ధ్యేయంగా, ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధిని తన లక్ష్యంగా భావించి సాగుతున్న బండారి లక్ష్మారెడ్డి మూడు సంవత్సరాల ప్రస్థానాన్ని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈ పుస్తకాన్ని రచించినట్లు ఆలేటి రమేష్ తెలిపారు. ఎమ్మెల్యే రాజకీయ ప్రస్థానం మాత్రమే కాకుండా, ప్రజలతో ఆయనకున్న అనుబంధం, ప్రజా సంక్షేమం పట్ల ఆయనకున్న నిబద్ధత, నియోజకవర్గ అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను అక్షర రూపంలో అందించే ప్రయత్నమే ఈ పుస్తకమని పేర్కొన్నారు. బండారి లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ పుస్తక ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేకతను సంతరించుకుంది. "ప్రజలే కుటుంబం - ప్రజా సేవే ధ్యేయం - అభివృద్ధే లక్ష్యం" అనే సందేశంతో సాగిన ఈ పుస్తకం, ఉప్పల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మూడు సంవత్సరాల ప్రజా ప్రస్థానానికి అక్షర సాక్ష్యంగా నిలవనుందన్నారు.

సింగిల్ విండో డైరెక్టర్ దేవన్న యాదవ్‌కు ఆదిత్య రెడ్డి సన్మానం



వనపర్తి,నవంబర్26(తెలంగాణ ముచ్చట్లు-):వనపర్తి నియోజకవర్గంలోని మహమ్మద్ హుస్సేన్ పల్లి గ్రామ సింగిల్ విండో డైరెక్టర్‌గా ఎన్నికైన దేవన్న యాదవ్‌ను తెలంగాణ రాష్ట్ర ఏఐపీసీ అధ్యక్షులు, వనపర్తి నియోజకవర్గ యువ నాయకులు డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దేవన్న యాదవ్‌కు శాలువా కప్పి, బహుమతిని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.గురువారం తన నివాసంలో నిర్వహించిన ఈ సన్మాన కార్యక్రమంలో డాక్టర్ జిల్లెల ఆదిత్య రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేసిన దేవన్న యాదవ్ సేవలను గుర్తించి సింగిల్ విండో డైరెక్టర్‌గా అవకాశం కల్పించడం సంతోషకరమని అన్నారు.పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కార్యకర్తలకు తగిన గుర్తింపు, అవకాశాలు లభించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. దేవన్న యాదవ్ తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ గ్రామంలోని రైతులకు, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని ఆకాంక్షించారు.సహకార రంగంలో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, గ్రామ అభివృద్ధిలో తనవంతు పాత్ర పోషించాలని ఆదిత్య రెడ్డి సూచించారు. భవిష్యత్తులో దేవన్న యాదవ్ మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షిస్తూ అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీపీసీసీ సోషల్ మీడియా స్టేట్ సెక్రటరీ దయాకర్, మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట పారిశుద్ధ్యంపై పట్టింపేది..?







- **కార్తీక పౌర్ణమి వేడుకల తర్వాత చెత్తకుప్పగా మారిన కీసరగుట్ట.!**

కీసర,నవంబర్26 (తెలంగాణ ముచ్చట్లు): ప్రముఖ శైవక్షేత్రమైన కీసరగుట్టలో కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ భవానీ శివ దుర్గా సమేత రామలింగేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనం అనంతరం గుట్టపై ఉన్న శివలింగాలకు భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అయితే భక్తులతో కిటకిటలాడిన కీసరగుట్ట.. వేడుకలు ముగిసిన తర్వాత ఎక్కడ చూసినా చెత్తాచెదారంతో దర్శనమివ్వడం ఆందోళన కలిగిస్తోంది.

కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య నిర్వహణకు తగిన ఏర్పాట్లు చేయాల్సి ఉండగా, గుట్టపై పలుచోట్ల చెత్త పేరుకుపోయి కనిపిస్తోంది. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాల్సిన సంబంధిత సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరించి, చెత్తను అక్కడే వదిలేసి వెళ్లిపోయారంటూ భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవమైన స్వామివారి క్షేత్రంలో ఇలాంటి అపరిశుభ్ర వాతావరణం నెలకొనడం బాధాకరమని భక్తులు పేర్కొంటున్నారు. ఆలయ పవిత్రతను కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తుచేస్తున్నారు.

ఇప్పటికైనా ఆలయ ఈఓ, చైర్మన్ స్పందించి ఆలయ సిబ్బందితో పాటు సంబంధిత మున్సిపల్ అధికారుల సమన్వయంతో గుట్టపై పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని భక్తులు కోరుతున్నారు. కేవలం పండుగలు, ప్రత్యేక ఉత్సవాల సమయంలోనే కాకుండా నిత్యం పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

12 ఏళ్ల తర్వాత కొత్తగూడెంలో చంద్రబాబు





- **ఏపీ ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.**

కొత్తగూడెం, నవంబరు 26 (తెలంగాణ ముచ్చట్లు): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా స్వాగతం పలికారు. దాదాపు 12 ఏళ్ల విరామం తర్వాత కుటుంబ సమేతంగా ఓ ప్రైవేటు వివాహ వేడుకకు హాజరయ్యేందుకు గురువారం కొత్తగూడెం వచ్చిన చంద్రబాబు దంపతులకు కలెక్టరేట్ సమీపంలోని హెలిప్యాడ్ వద్ద మంత్రి తుమ్మల పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రి తుమ్మలతో పాటు స్థానిక శాసనసభ్యుడు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉన్నతాధికారులు చంద్రబాబు దంపతులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల, చంద్రబాబు ఆతీ్మయంగా పలకరించుకున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు మంత్రివర్గంలో తుమ్మల నాగేశ్వరరావు సుదీర్ఘ కాలం మంత్రిగా పనిచేసిన అనుబంధం ఈ కలయికకు ప్రత్యేకతను సంతరించుకుంది. కాగా, చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పాల్వంచలోని నవభారత్ ప్రాంగణంలో గురువారం సాయంత్రం నుంచి శుక్రవారం సాయంత్రం వరకు నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ముఖ్య మంత్రి పర్యటన నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ప్రతి ఇంటికీ సైబర్ భద్రతపై అవగాహన.. సురక్షిత కుటుంబమే లక్ష్యం!





- **హర్ ఘర్ కి సైబర్ అవేర్‌నెస్ కార్యక్రమంలో భాగంగా గట్ల నర్సింగాపూర్‌లో ఇంటింటా ప్రచారం**
- **సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**
- **ఓటీపీ, పిన్, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పొద్దు**
- **అనుమానాస్పద లింక్‌లను క్లిక్ చేయవద్దు**
- **సైబర్ మోసానికి గురైతే 1930కు ఫోన్ చేయాలి**

భీమదేవరపల్లి, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): సైబర్ నేరాల నుంచి ప్రతి కుటుంబాన్ని రక్షించడమే లక్ష్యంగా తెలంగాణ పోలీస్ శాఖ చేపట్టిన 'హర్ ఘర్ కి సైబర్ అవేర్‌నెస్ - సేఫ్ ఫ్యామిలీ.. సెక్యూర్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా గట్ల నర్సింగాపూర్ గ్రామంలో ఇంటింటా సైబర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ శీను,ముల్కనూర్ ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఆన్‌లైన్ మోసాలు, బ్యాంకింగ్ మోసాలు, నకిలీ ఫోన్ కాల్స్, గుర్తుతెలియని లింక్‌ల ద్వారా జరిగే సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బ్యాంకు ఖాతాలకు సంబంధించిన ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లు, వ్యక్తిగత వివరాలను ఎవరికీ వెల్లడించవద్దని హెచ్చరించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింక్‌లను క్లిక్ చేయకూడదని, సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకునే విషయంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.మొబైల్ ఫోన్లు, కంప్యూటర్లలో భద్రతాపరమైన అప్‌డేట్స్ ఎప్పటికప్పుడు చేసుకోవాలని, బలమైన పాస్‌వర్డ్‌లను వినియోగించాలని సూచించారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.గ్రామంలోని ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకుని, కుటుంబ సభ్యులకు కూడా తగిన జాగ్రత్తలు వివరించాలని పోలీసులు కోరారు. ప్రజల అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అరికట్టవచ్చని, సైబర్ నేరాల రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడుకోవడమే అంబేద్కర్‌కు నిజమైన నివాళి

- **కరీంనగర్ బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు**



జమ్మికుంట, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రజాస్వామ్య విలువలు, సమానత్వ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని బీజేపీ నాయకులు పిలుపునిచ్చారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బీజేపీ కరీంనగర్ జిల్లా ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు.

రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు క్రాంతి కిరణ్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా విద్యుత్ కార్యాలయం నుంచి కోర్టు చౌరస్తా వరకు నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కోర్టు చౌరస్తాలోని భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ పీఠికను సామూహికంగా చదివి, రాజ్యాంగ ఆశయాలకు అనుగుణంగా నడుచుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశంలోని ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, న్యాయం కల్పిస్తూ ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తోందని పేర్కొన్నారు. అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమాన అవకాశాలు కల్పించడంలో రాజ్యాంగం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ దూరదృష్టితో రూపొందించిన రాజ్యాంగం అందించిన స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని సూచించారు.

కులమత, ప్రాంతీయ భేదాలకు అతీతంగా సమానత్వం, సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వెల్లివిరిసే సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ హక్కులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడంతో పాటు రాజ్యాంగ విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిని మల్లేశం, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బత్తుల లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గ సభ్యులు రాజేష్ ఠాకూర్, జాడి బాలరెడ్డి, దొంతరవేన రమేష్, తూర్పటి రాజు, కవిడే కుమార్, శ్రీనివాస్, దొడ్డే వేణు, రాకేష్ ఠాకూర్, నరాల రాజశేఖర్, రమేష్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

- **జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవ వేడుకలు**



జమ్మికుంట, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): భారత రాజ్యాంగం దేశ ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని, ప్రతి పౌరుడు రాజ్యాంగం కల్పించిన హక్కులు, బాధ్యతలను తెలుసుకొని వాటిని గౌరవించాలని జమ్మికుంట ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్యామల అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్యామల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం. శ్యామల మాట్లాడుతూ ప్రపంచంలోనే భారత రాజ్యాంగం అతిపెద్ద లిఖిత రాజ్యాంగంగా గుర్తింపు పొందిందని పేర్కొన్నారు. రాజ్యాంగం దేశ పౌరులకు కల్పించిన స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం వంటి ప్రాథమిక విలువలను ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. రాజ్యాంగాన్ని గౌరవించడం ద్వారా దేశ గౌరవాన్ని మరింత పెంపొందించాలని అన్నారు. రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చేసిన అపారమైన కృషి, దూరదృష్టి చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర అధ్యాపకురాలు డాక్టర్ కె. మాధవి, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. రాజేంద్రం, స్టాఫ్ క్లబ్ కార్యదర్శి డాక్టర్ కె. గణేష్, వి. కిరణ్ కుమార్, డాక్టర్ సి. రాజకుమార్, డాక్టర్ ఇ. రవి, ఎల్. రవీందర్, పి. శ్రీనివాస్ రెడ్డి, ఎన్. మమత, డాక్టర్ పి. సుష్మ, డాక్టర్ పి. రవిప్రకాశ్, డాక్టర్ ఎన్. శ్రీనివాస్, సాయి కుమార్, అరుణ్ రాజ్, అనూష, దీనా, డాక్టర్ వనిత, కార్యాలయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

వెల్టూర్‌లో 85 మందికి చేయూత పెన్షన్లు జమ

- **ప్రేమ్ సాగర్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు**



పెద్దమందడి, నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో 85 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో చేయూత పెన్షన్ నగదు జమ కావడం జరిగింది. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ సాగర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు కృషి చేస్తోందని అన్నారు.కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ప్రజా పాలన అందిస్తోందని తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రజా సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తున్నారని ప్రేమసాగర్ కొనియాడారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటి పరిష్కారానికి ముందుంటున్నారని అన్నారు.వెల్టూర్ గ్రామంలో 85 మంది లబ్ధిదారులకు చేయూత పెన్షన్లు జమ కావడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరింత అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ సాగర్ పేర్కొన్నారు.



మోజర్లలో ఘనంగా 'తొలి ముద్ద' కార్యక్రమం

- **చిన్నారులకు పౌష్టికాహారం అందించిన సర్పంచ్ చంద్రశేఖర్**

పెద్దమంద,నవంబర్26(తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో నిర్వహించిన 'తొలి ముద్ద' కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు పౌష్టికాహారం అందించి, వారి ఆరోగ్యం, ఎదుగుదలకు అవసరమైన పోషక విలువలపై అవగాహన కల్పించారు.చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించడం, పిల్లల ఎదుగుదలకు అవసరమైన పోషక విలువల గురించి తల్లిదండ్రులకు తెలియజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యమే గ్రామ భవిష్యత్తుకు పునాది అని అన్నారు. ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, ఆనందంగా ఎదగాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమని పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు.పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, చిన్నతనం నుంచే మంచి ఆహారపు అలవాట్లు అలవరచాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రాములు, వార్డు సభ్యురాలు నాగమణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యుగేందర్, అంగన్వాడీ టీచర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

మోజర్లలో ఇందిరమ్మ ఇళ్ల ఫైనల్ బిల్లుల పరిశీలన

- **క్షేత్రస్థాయిలో ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేసిన అధికారులు.. పాల్గొన్న సర్పంచ్ చంద్రశేఖర్**



పెద్దమందడి,నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం మోజర్ల గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద నిర్మాణాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు సంబంధించి ఫైనల్ బిల్లు వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా వనపర్తి జిల్లా డీఈ విఠోభ గ్రామానికి విచ్చేసి, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనుల నాణ్యత, పురోగతి, ఫైనల్ బిల్లులకు సంబంధించిన వివరాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరడం సంతోషకరమని అన్నారు. లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బిల్లుల ప్రక్రియ పారదర్శకంగా, త్వరితగతిన పూర్తయ్యేలా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ కృషి చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా గ్రామపంచాయతీ తరపున పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రశేఖర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు రాములు, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, హౌసింగ్ ఏఈ స్వాతి, సంబంధిత అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
శుక్రవారం - 27 - నవంబర్ 2026

పీఆర్సీ అమలులో జాప్యం ఎందుకు?

- **ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి**
- **డీటీఎఫ్ ప్రధాన కార్యదర్శి అటుకుల శ్రీనివాస్ రెడ్డి డిమాండ్**



జమ్మికుంట, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రెండో వేతన సవరణ సంఘం (పీఆర్సీ) సిఫార్సులను వెంటనే అమలు చేయాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అటుకుల శ్రీనివాస్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొదటి పీఆర్సీ గడువు ముగిసి 40 నెలలు గడుస్తున్నా రెండో పీఆర్సీ అమలుకు చర్యలు తీసుకోకపోవడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలను నిరాశకు గురిచేస్తోందన్నారు. వెంటనే పీఆర్సీ కమిషన్ నివేదికను తెప్పించుకొని వేతన సవరణను అమలు చేయాలని కోరారు.

గురువారం జమ్మికుంటలో డీటీఎఫ్ కరీంనగర్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన అటుకుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటివరకు ఆ దిశగా చర్యలు చేపట్టలేదని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రెగ్యులర్, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల కోట్లాది రూపాయల ఆర్థిక బిల్లులను వెంటనే విడుదల చేయాలని, హెల్త్ కార్డుల అమలుపై సమగ్ర సమీక్ష చేపట్టాలని కోరారు.

ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణకు సంబంధించిన జీవో 25 అశాస్త్రీయంగా ఉందని పేర్కొంటూ, పాఠశాలల వారీగా విద్యార్థులు, తరగతుల సంఖ్య ఆధారంగా ఉపాధ్యాయుల పోస్టులను నిర్ణయించాలని సూచించారు. పాఠశాల విద్యారంగంలో స్వచ్ఛంద సంస్థల జోక్యం, అనధికారిక కార్యక్రమాలు పెరుగుతుండటంతో ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూముల తిరుపతి మాట్లాడుతూ ఇంటర్మీడియట్ విద్యను పాఠశాల విద్యలో విలీనం చేసి సీనియర్ సెకండరీ విద్యగా అమలు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. అయితే ఈ ప్రక్రియలో ప్రిన్సిపాళ్లు, లెక్చరర్లు, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, స్కూల్ అసిస్టెంట్లు, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులు, పీజీటీలు, టీజీటీల మధ్య తలెత్తే సర్వీసు సమస్యలు, బోధనా అర్హతలు, అధికారాల విభజనపై స్పష్టత అవసరమన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల నిర్వహణకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయ సంఘాలు, విద్యావేత్తలు, నిపుణులతో సమగ్ర చర్చలు జరిపిన తర్వాతే విలీన ప్రక్రియ చేపట్టాలని సూచించారు.

డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం. రఘు శంకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ పెరగడం వల్ల సమాజంలో విద్యాపరమైన అసమానతలు తీవ్రతరమవుతున్నాయని అన్నారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని, పేద కుటుంబాలపై విద్యాభారం పెరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలకు కామన్ స్కూల్ విధానమే సరైన పరిష్కారమని అభిప్రాయపడ్డారు.

డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలోని మెజారిటీ మండలాలు, జిల్లాలు ఇన్‌చార్జి విద్యాధికారులతోనే కొనసాగుతున్నాయని తెలిపారు. విద్యాశాఖ పరిపాలనను బలోపేతం చేసేందుకు రెగ్యులర్ మండల విద్యాధికారులు, ఉప విద్యాధికారులు, జిల్లా విద్యాధికారులను వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అటుకుల శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు తూముల తిరుపతి, రాష్ట్ర పూర్వ అధ్యక్షులు కె. నారాయణరెడ్డి, ఎం. రఘుశంకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి చకినాల రామ్మోహన్, జిల్లా కమిటీ సభ్యులు ఏ. దామోదర్, తాళ్లపెల్లి తిరుపతి గౌడ్, బి. రమేష్, శ్రీరాం చక్రధర్, యు. శంకర్, రాష్ట్ర కౌన్సిలర్లు ఎం. సదానందం, ఎస్. సంపత్, పి. ఈశ్వర్ రెడ్డి, బి. తిరుపతి రెడ్డి, డి. సదానందం, కె. సమ్మిరెడ్డి, కె. వెంకట్ రెడ్డి, ప్రకాష్, రత్నం, హరీష్‌కుమార్, వేణుమాధవ్, కె. సంపత్, సీహెచ్. వేణు పాల్గొన్నారు.

ఎన్నికల హామీకి కార్యరూపం నూతన వధూవరులకు కౌన్సిలర్ రాము కానుక!

- **మాట తప్పని కౌన్సిలర్.. పెళ్లి వేడుకలో రూ.10,016 కానుకతో రాము ప్రత్యేకత!**

జమ్మికుంట, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): మున్సిపల్ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూ కౌన్సిలర్ పొనగంటి రాము తన హామీని అమలు చేశారు. నూతన వధూవరులు పొనగంటి అంజలి, ఏ. బుషి వికాస్ వివాహ వేడుకకు హాజరైన ఆయన దంపతులను ఆప్యాయంగా ఆశీర్వదించి, వారి నూతన జీవితానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన వధూవరులకు నూతన వస్త్రాలను అందజేయడంతో పాటు రూ.10,016 నగదును వివాహ కానుకగా అందించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని గుర్తుంచుకొని వివాహ వేడుకలో నూ తన వంతు సహకారం అందించడం ద్వారా ఇచ్చిన మాటకు కట్టుబడి ఉన్నట్లు చాటుకున్నారు. ప్రజలతో ఎన్నికల సమయంలో ఏర్పడిన అనుబంధాన్ని కొనసాగిస్తూ, వారి కుటుంబాల్లో జరిగే శుభకార్యాల్లో భాగస్వామి కావడం సంతోషకరమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు.



ఖమ్మంలో ఘనంగా జీఎస్టీ అవగాహన సదస్సు

- **57వ జీఎస్టీ మండలి నిర్ణయాలు, పన్ను చెల్లింపుదారులకు కల్పించిన వెసులుబాట్లపై అవగాహన**



ఖమ్మం బ్యూరో, నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): ఖమ్మం కేంద్ర వస్తు సేవల పన్ను విభాగం ఆధ్వర్యంలో పన్ను చెల్లింపుదారులకు అవగాహన కల్పించేందుకు "సహజ్ కర్ సంవాద్" పేరుతో ప్రత్యేక సదస్సును ఘనంగా నిర్వహించారు. సరళమైన పన్ను విధానం – సాధికారత కలిగిన పన్ను చెల్లింపుదారుడు అనే లక్ష్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 57వ జీఎస్టీ మండలి సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలు, సిఫార్సులు, పన్ను చెల్లింపుదారులకు కల్పించిన వెసులుబాట్లను వివరించారు.

ఈ కార్యక్రమంలో ఖమ్మం కేంద్ర వస్తు సేవల పన్ను సహాయ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్, పర్యవేక్షకులు నూతన్ కుమార్, వంశీ, సాయి చౌహాన్, దినేష్ నాయక్, ప్రణీత్‌తో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాపార వర్గాల నుంచి గ్రానైట్ యజమానుల సంఘం అధ్యక్షుడు యుగంధర్, వాణిజ్య మండలి అధ్యక్షుడు కురివెళ్ల ప్రవీణ్, కార్యదర్శి సోమ నరసింహారావు, ఇనుప వ్యాపారుల సంఘం అధ్యక్షుడు నాగరాజు, ఐటీసీ భద్రాచలం లెక్కల అధికారి సునీల్ కుమార్, సింగరేణి సంస్థ లెక్కల అధికారి మొహమ్మద్ అర్షద్ తదితరులు హాజరయ్యారు.

ఖమ్మం జిల్లా జీఎస్టీ వృత్తి నిపుణుల సంఘం అధ్యక్షుడు ఉల్లిబోయిన సైదులు, ప్రధాన కార్యదర్శి కొమ్మరాజు పవన్ కుమార్, కోశాధికారి గుద్దేటి రమేష్‌తో పాటు సంఘం సీనియర్ సభ్యులు, కార్యవర్గ సభ్యులు, ఇతర వృత్తి నిపుణులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు ఉల్లిబోయిన సైదులు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి వృత్తిపరమైన నాయకత్వంలో ప్రాతినిధ్యం ఉండటం గర్వకారణమన్నారు. జీఎస్టీ చట్టాలు, నిబంధనల్లో ఎప్పటికప్పుడు వస్తున్న మార్పులు, సవరణలు, పన్ను చెల్లింపుదారులకు కల్పించాల్సిన సౌకర్యాలపై తమ సంఘం తరఫున సంబంధిత శాఖకు పలుమార్లు వినతులు సమర్పిస్తూ విధానపరమైన మార్పులకు కృషి చేస్తున్నామని తెలిపారు.

వ్యాపారవేత్తలకు, పన్నుల శాఖ అధికారులకు మధ్య వృత్తి నిపుణులు వారధిగా పనిచేస్తారని పేర్కొన్నారు. పన్ను నిబంధనలను వ్యాపారులకు సులభంగా అర్థమయ్యేలా వివరించడం, పన్ను చెల్లింపులో తగిన మార్గదర్శకత్వం అందించడం, శాఖకు మరియు పన్ను చెల్లింపుదారులకు మధ్య సమన్వయం సాధించడంలో వారి పాత్ర కీలకమని వివరించారు.

ఇలాంటి అవగాహన సదస్సులు అధికారులకు, వ్యాపారవేత్తలకు, వృత్తి నిపుణులకు మధ్య పరస్పర అవగాహనను పెంపొందిస్తాయని తెలిపారు. పన్ను విధానాలను మరింత సరళంగా, సమర్థవంతంగా అమలు చేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు.

ఈ సదస్సుతో పన్నుల శాఖకు, వ్యాపార వర్గాలకు, వృత్తి నిపుణులకు మధ్య పరస్పర సహకారం, సమన్వయం మరింత బలోపేతమైంది.

రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలి

- **సర్పంచ్ భూక్య మేనక సుధాకర్ నాయక్, ఉప సర్పంచ్ అరూరి రవిచందర్**



జనగామ, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): భారత రాజ్యాంగం దేశ ప్రజలకు కల్పించిన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం, సామాజిక న్యాయం వంటి మౌలిక విలువలను ప్రతి ఒక్కరూ గౌరవిస్తూ, రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలని వంగాలపల్లి గ్రామ సర్పంచ్ భూక్య మేనక సుధాకర్ నాయక్, ఉప సర్పంచ్ అరూరి రవిచందర్ అన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని చిల్పూర్ మండలం వంగాలపల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో వారి ఆధ్వర్యంలో రాజ్యాంగ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించడంతో పాటు సమాజంలో కుల, మత, ప్రాంతీయ భేదాలకు తావులేకుండా సమానత్వం, సౌభ్రాతృత్వం పెంపొందించే గొప్ప మార్గదర్శి అని పేర్కొన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను వినియోగించుకోవడంతో పాటు ప్రతి పౌరుడు తన విధులను బాధ్యతగా నిర్వర్తించాలని సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేస్తూ రాజ్యాంగ విలువలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమం, పారదర్శక పాలనకు రాజ్యాంగ స్ఫూర్తితో ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

అనంతరం ప్రజాప్రతినిధులు, గ్రామపంచాయతీ సిబ్బందితో కలిసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి మమత, పాలక మండలి సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్ జి కె లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం



- **చిన్నారులతో మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు..**

కీసర, నవంబర్ 26,(తెలంగాణ ముచ్చట్లు) : కీసర సర్కిల్ పరిధిలోని దమ్మాయిగూడ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప కాలనీలో ఉన్న చైతన్య భూమి ప్రాంగణంలో మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సానాది మోక్ష, సానాది అద్విక్ మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘం పెద్దలు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం కల్పించిందని తెలిపారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా నేటి యువత, చిన్నారులు విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. మహనీయుల త్యాగాలను, వారు సమాజానికి చేసిన సేవలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కులమతాలకు అతీతంగా సమానత్వం, సోదరభావంతో అందరూ కలిసి సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాల మహానాడు అధ్యక్షుడు గుజ్జుక పరశురాం,మాల సంఘం ముఖ్య సలహాదారులు యాటరాజు, ప్రధాన కార్యదర్శి బయ్యే గౌతం, మాజీ అధ్యక్షుడు మోత రాజేంద్రప్రసాద్,సానాది సాయిబాబ,బత్తుల శ్రీనివాస్,కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం జైలు సూపరింటెండెంట్‌కు ఎంపీజే బృందం శుభాకాంక్షలు



ఖమ్మం బ్యూరో , నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజే) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం ఆధ్వర్యంలో సంస్థ ప్రతినిధుల బృందం ఖమ్మం జైలు సూపరింటెండెంట్ రామయ్య యాదరిని మర్యాదపూర్వకంగా కలిసింది. ఇటీవల బదిలీపై ఖమ్మం జైలు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎంపీజే సంస్థ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలను జిల్లా అధ్యక్షుడు షేక్ ఖాసిం వివరించారు. జైలు శాఖతో సమన్వయంతో ప్రజా సేవా కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు ఎంపీజే ఎల్లప్పుడూ సహకారం అందిస్తుందని షేక్ ఖాసిం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఎం.డీ. హకీమ్, కార్యదర్శి ఎం.డీ.రజబాలి, ఎండీ రఫీక్, సభ్యులు ఎండీ మహమూద్, ఎండీ అహ్మద్, ఎస్.కె. హుసేన్ మియా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన పోలీస్ సేవలే లక్ష్యం.. ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన ఏసీపీ!



ఎల్కతుర్తి నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్‌ను కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి గురువారం సాయంత్రం సందర్శించి వార్షిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ రికార్డులను, కేసులకు సంబంధించిన ఫైళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో మాట్లాడి వారి విధులు, బాధ్యతలు, పనితీరుపై వివరాలు తెలుసుకున్నారు.పోలీసింగ్ వ్యవస్థ, విలేజ్ పోలీస్ ఆఫీసర్ (వీపీఓ) విధులు, ఎన్‌డీపీఎస్ కేసులు, సైబర్ నేరాల దర్యాప్తు, కేసుల నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, బాధితుల సమస్యలను సానుకూలంగా విని, చట్ట పరిధిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.పోలీస్ శాఖ గౌరవం పెరిగేలా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా పనిచేయాలని, ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ నరసింహారావు, ఏఎస్ఐ శంకర్, హెడ్ కానిస్టేబుల్‌తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



తాటికాయల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

- **విద్యార్థులకు ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు**
- **విజేతలకు బహుమతుల ప్రదానం**





పోటీల విజేతలు వీరే..

చిత్రలేఖనం పోటీల్లో సీనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని శివసాయి, ద్వితీయ బహుమతిని సాయి రిషిక్, తృతీయ బహుమతిని ప్రతిభ అందుకున్నారు. జూనియర్స్ విభాగంలో ప్రథమ బహుమతిని శ్లేషా, ద్వితీయ బహుమతిని సాయికుమార్, తృతీయ బహుమతిని శివానందు కైవసం చేసుకున్నారు. రాజ్యాంగ ప్రవేశిక పఠన పోటీలో ప్రథమ బహుమతిని శ్రవంతి, ద్వితీయ బహుమతిని రుత్విక, తృతీయ బహుమతిని చరణ్య సాధించారు. వ్యాసరచన పోటీలో ప్రథమ బహుమతిని హాస్య, ద్వితీయ బహుమతిని అక్షయ, తృతీయ బహుమతిని అవంతిక అందుకున్నారు.

ధర్మసాగర్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని తాటికాయల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు, సీనియర్ పాత్రికేయులు బొల్లెపాక రాజేష్, యువజన సంఘాల నాయకుడు పట్ల ప్రవీణ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమంలో తొలుత భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజ్యాంగ దినోత్సవ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరిస్తూ వారిలో రాజ్యాంగ విలువలు, ప్రజాస్వామ్య స్ఫూర్తి, సమానత్వ భావనలను పెంపొందించే లక్ష్యంతో ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు ఫాతిమా మేరీ మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి హక్కులతో పాటు బాధ్యతలను కూడా కల్పించిందని పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి విలువలను విద్యార్థులు చిన్ననాటి నుంచే అలవర్చుకోవాలని సూచించారు. రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆశయాలను అర్థం చేసుకొని విద్య ద్వారా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజు మాట్లాడుతూ విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమని అన్నారు. ఇలాంటి పోటీల నిర్వహణ ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. సీనియర్ పాత్రికేయులు బొల్లెపాక రాజేష్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, అవకాశాలు కల్పించిందని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత, భాషా భేదాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, న్యాయం కల్పించాలనే గొప్ప ఆశయంతో రాజ్యాంగం రూపుదిద్దుకుందని తెలిపారు. అంబేద్కర్ అందించిన రాజ్యాంగ స్ఫూర్తిని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక బాధ్యతను, ప్రజాస్వామ్య విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

యువజన సంఘాల నాయకుడు పట్ల ప్రవీణ్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులు, వాటి ప్రాముఖ్యతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం వెల్లివిరిసేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని అన్నారు. అంబేద్కర్ ఆశయాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. అనంతరం నిర్వహించిన ఉపన్యాస, వ్యాసరచన, చిత్రలేఖన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రతి విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను సీనియర్ పాత్రికేయులు బొల్లెపాక రాజేష్ మరియు పట్ల శ్యామ్ ఆధ్వర్యంలో అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించేలా బహుమతులు అందించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో రాజ్యాంగంపై అవగాహన పెంపొందించడంతో పాటు అంబేద్కర్ ఆశయాలు, ప్రజాస్వామ్య విలువల పట్ల చైతన్యాన్ని నింపింది.

ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

- **బొమ్మకల్ గ్రామంలో నాణ్యత లోపాలతో మురికి కాలువల నిర్మాణం**
- **సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి**







సైదాపూర్,నవంబర్ 26(తెలంగాణ ముచ్చట్లు): ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బొమ్మకల్ గ్రామానికి చెందిన ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని మురికి కాలువల నిర్మాణంలో నాణ్యత లోపాలు చోటుచేసుకున్నాయని, దీనిపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. బొమ్మకల్ గ్రామం (వి. సైదాపూర్) పరిధిలో నిర్మించిన సైడ్ మురికి కాలువల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించలేదని ఫిర్యాదుదారులు పేర్కొంటున్నారు.గ్రామంలో సర్పంచ్, ఉపసర్పంచ్, ఏఈ, ఎంపీవో అధికారులు కుమ్మక్కై నాణ్యత లోపాలతో కూడిన కాలువల నిర్మాణానికి పాల్పడ్డారని ఆరోపిస్తున్నారు. ఈ సమస్యపై ప్రజావాణిలో ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఫిర్యాదుదారులు తెలిపారు. అంతేకాకుండా, ఈ ఫిర్యాదుపై విచారణ జరిపి సమస్యను పరిష్కరించాల్సిన ఏఈ, ఎంపీవో, కలిసి ఫిర్యాదును పక్కదారి పట్టిస్తున్నారని ఆరోపించారు.ప్రజావాణిలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ, వాటిని పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ప్రజాధనంతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, ఫిర్యాదులపై స్పందించకపోవడం పట్ల గ్రామస్థులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యత లోపాలపై సమగ్ర విచారణ జరపాలి

బొమ్మకల్ గ్రామంలో నిర్మించిన సైడ్ మురికి కాలువల పనులపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని ఫిర్యాదుదారులు డిమాండ్ చేస్తున్నారు. నిర్మాణ పనుల నాణ్యతను పరిశీలించి, బాధ్యులుగా తేలిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజావాణిలో చేసిన ఫిర్యాదును పక్కదారి పట్టించకుండా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి ప్రజలకు న్యాయం చేయాలని సంబంధిత ఉన్నతాధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే, నాణ్యత లోపాలతో నిర్మించిన మురికి కాలువలకు అవసరమైన మరమ్మతులు చేపట్టి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

ప్యాకెట్లపై ఎర్రటి హెచ్చరికలు తప్పనిసరి!



(మొదటి పేజీ తరువాయి)

కొత్త నిబంధనల ప్రకారం ప్రతి ప్యాకెట్ ముందు భాగంలో ఎర్రటి షడ్భుజి ఆకారంలో హెచ్చరిక గుర్తులను ముద్రించాల్సి ఉంటుంది. అధిక కొవ్వు, అధిక చక్కెర, అధిక ఉప్పు అనే మూడు అంశాలకు కలిపి ఒకే గుర్తును ఉపయోగించకుండా, ఒక్కో పోషకానికి ఒక్కో ప్రత్యేక గుర్తును ఏర్పాటు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. దీనివల్ల ఒక ఆహార పదార్థంలో ఏ పోషకం అధికంగా ఉందో వినియోగదారులు సులభంగా గుర్తించగలుగుతారు. ఈ హెచ్చరికలు ప్యాకెట్ ముందు భాగంలో సుమారు 4 నుంచి 5 శాతం స్థలాన్ని ఆక్రమించేలా ఉండాలని, సాధారణంగా షాపింగ్ చేసే సమయంలోనూ సులభంగా చదవగలిగేంత పెద్ద అక్షరాలతో ముద్రించాలని సూచించింది.

'3ఎస్ అండ్ అవర్ హెల్త్ సొసైటీ' అనే సంస్థ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఆహార పదార్థాల్లో పోషకాల పరిమాణాన్ని అంచనా వేసే విషయంలోనూ స్పష్టమైన మార్గదర్శకాలను నిర్దేశించింది. కేవలం తయారీ సమయంలో అదనంగా కలిపిన చక్కెర, కొవ్వులనే పరిగణనలోకి తీసుకోకుండా, ఆహార పదార్థంలో సహజంగా ఉన్న వాటితో సహా మొత్తం చక్కెరలు, సంతృప్త కొవ్వుల పరిమాణాన్ని ఆధారంగా చేసుకొని హెచ్చరికల పరిమితులను నిర్ణయించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐని ఆదేశించింది. దీనివల్ల ఆహార ఉత్పత్తుల తయారీ సంస్థలు తమ ఉత్పత్తుల్లోని పోషకాల వివరాలను మరింత బాధ్యతాయుతంగా వెల్లడించాల్సి ఉంటుంది.

ప్యాకేజ్డ్ ఆహార పదార్థాలపై హెచ్చరికలు ముద్రించడంతోపాటు చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాల్సిన అవసరాన్ని కూడా సుప్రీం కోర్టు ప్రస్తావించింది. పాఠశాల విద్యార్థులకు పోషకాహారం, సమతుల ఆహారం, అధిక చక్కెర, ఉప్పు, కొవ్వు వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించేలా పాఠ్య ప్రణాళికలో మార్పులు తీసుకురావాలని సూచించింది. కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా విద్యార్థులు స్వయంగా పాల్గొనే ప్రాక్టికల్ కార్యక్రమాలను కూడా నిర్వహించాలని ప్రభుత్వానికి తెలిపింది. చిన్నతనం నుంచే ఆహార పదార్థాలపై ఉన్న సమాచారాన్ని చదివి, వాటి పోషక విలువలను అర్థం చేసుకునే అలవాటు ఏర్పడితే భవిష్యత్తులో ఆరోగ్యకరమైన జీవనశైలికి పునాది పడుతుందని ఈ సూచనల ఉద్దేశం.

కొత్త నిబంధనల ముసాయిదాను రూపొందించేందుకు సుమారు నాలుగు నెలలు, వాటిని అమలు చేసేందుకు ఆహార పరిశ్రమకు 365 రోజుల సమయం ఇస్తామని ఎఫ్ఎస్ఎస్ఏఐ కోర్టుకు ప్రతిపాదించింది. ఈ గడువు సహేతుకంగా ఉందని పేర్కొన్న ధర్మాసనం, నిర్ణయించిన కాలపరిమితిని కచ్చితంగా పాటించాలని స్పష్టం చేసింది. ఎట్టి పరిస్థితుల్లోనూ గడువును పొడిగించడానికి వీల్లేదని, నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ మార్పులు అమల్లోకి వస్తే ఆహార ప్యాకెట్లపై పోషక వివరాలను పరిశీలించి కొనుగోలు చేసే అవకాశం వినియోగదారులకు మరింత పెరుగుతుంది. ముఖ్యంగా పిల్లలు, యువతలో పెరుగుతున్న అనారోగ్యకర ఆహారపు అలవాట్లను తగ్గించేందుకు హెచ్చరికల లేబులింగ్, పాఠశాల స్థాయి అవగాహన కార్యక్రమాలు ఎంతవరకు దోహదపడతాయన్నది కీలకంగా మారనుంది.

గిరిజనుల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- **మద్దిమడుగులో సేవాలాల్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన**
- **రూ.38 కోట్లతో ఆలయం, విగ్రహ నిర్మాణ పనులు**
- **ఇందిరమ్మ ఇళ్లలో ఎస్సీ, ఎస్టీలకు 45 శాతం కేటాయింపు**
- **డిండి ప్రాజెక్టు నుంచి నీరిచ్చే బాధ్యత ప్రభుత్వానిదే :సీఎం రేవంత్**

నాగర్‌కర్నూల్, నవంబర్ 26 (తెలంగాణ ముచ్చట్లు): రాష్ట్రంలోని బంజారాలు, ఆదివాసీలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలన్న సంకల్పంతోనే సంక్షేమ పథకాల్లో గిరిజన వర్గాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం మద్ది మడుగులో రూ.38 కోట్లతో నిర్మించనున్న సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం, విగ్రహ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. మద్దిమడుగుకు చేరుకున్న ముఖ్యమంత్రి తొలుత శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మొత్తం రూ.71 కోట్లతో చేపట్టనున్న మూడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయం, విగ్రహ నిర్మాణంతోపాటు శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో రూ.15 కోట్లతో నిర్మించనున్న హరిత హోటల్ భవనానికి, రూ.18 కోట్లతో చేపట్టనున్న ఆలయ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ, ప్రభుత్వం మంజూరు చేసిన 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లలో దాదాపు 45 శాతం ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కేటాయించినట్లు గుర్తుచేశారు. రాష్ట్రంలో 3.48 కోట్ల మంది పేదలకు సన్నబియ్యం అందిస్తున్నామని, వారిలో లంబాడ, ఆదివాసీ కుటుంబాలు అధికంగా లబ్ధి పొందుతున్నాయని వివరించారు. ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ వంటి పథకాల వెనుక గిరిజన, ఆదివాసీ వర్గాల అభివృద్ధి లక్ష్యం ఉందని రేవంత్ రెడ్డి తెలిపారు. ఆయా వర్గాలు ఆర్థికంగా, సామాజికంగా ఎదిగి దేశ సేవలో గొప్పగా రాణించాలన్న ఉద్దేశంతో సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. లంబాడీల ఆరాధ్య దైవమైన సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప ఆదర్శమూర్తి అని కొనియాడారు. శాంతియుత జీవనం, హింసకు దూరంగా ఉండటం, మాంసాహారం, మద్యానికి దూరంగా జీవించడం, పేదలకు సేవ చేయడం వంటి విలువలను ఆయన బోధించారని గుర్తుచేశారు. సమాజానికి ఆదర్శంగా నిలవాలని చెప్పిన సేవాలాల్ బోధనలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని పేర్కొన్నారు. లంబాడీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టే ఉద్దేశంతో అప్పటి ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 1976లో లంబాడాలను ఎస్టీ జాబితాలో చేర్చారని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. ఎస్టీ రిజర్వేషన్ల ద్వారా గిరిజనులు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో అవకాశాలు పొందుతూ ఉన్నత స్థానాలకు చేరుకుంటున్నారని తెలిపారు. భూమిలేని, వలసలు వెళ్లే గిరిజన కుటుంబాలకు అసైన్మెంట్, పోడు భూముల పట్టాలు అందించారని, ఇందిరా గాంధీ హయాంలో గిరిజనులకు 10 నుంచి 12 లక్షల ఎకరాల భూమి పంపిణీ చేసిన విషయాన్ని ప్రస్తావించారు. తనది కొండారెడ్డిపల్లి అని, తాను అచ్చంపేట ప్రాంతానికి చెందిన నల్లమల బిడ్డనని చెప్పుకోవడం గర్వంగా ఉంటుందని అన్నారు. ఈ ప్రాంత ప్రజల కష్టపడే తత్వం, పోరాట పటిమ, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే స్వభావం తనకు స్ఫూర్తినిచ్చాయని పేర్కొన్నారు.మద్ది మడుగులో 16 ఎకరాల్లో సంత్ సేవాలాల్ ఆలయాన్ని నిర్మిస్తున్నామని, మరో నాలుగు ఎకరాలు సేకరించి అద్భుతమైన ఆలయంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. అచ్చంపేట ప్రాంతంలో బ్రిడ్జి, లిఫ్ట్ పనులతోపాటు పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేయిస్తామని తెలిపారు. డిండి ప్రాజెక్టు నుంచి ఈ ప్రాంతానికి నీరు అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in